

సైదాపురం : సిద్ధలకోనలో పూజలందుకున్న సత్యనారాయణ స్వామి ఉత్సవ మూర్తులు

హరహర.. మహాదేవ!

- మార్మోగిన శైవక్షేత్రాలు
- ఘనంగా నాలుగో కార్తీక సోమవారం పూజలు
- పెద్దసంఖ్యలో పాల్గొన్న భక్తులు



నెల్లూరు (సాంస్కృతికం) నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని శైవక్షేత్రాలు కార్తీకమాసం చివరి సోమవారం సందర్భంగా భక్తులతో పోటెత్తాయి. హరహర.. మహదేవ.. శంభో శంకర.. ఓం నమశ్శివాయః.. తదితర నామస్మరణలతో శివాలయాలు మారుమోగిపోయాయి. పాలభిషేకం కోసం సూర్యోదయానికి ముందే శివాలయాలకు భక్తులు బారులు తీరారు. అలాగే సముద్ర స్నానాల కోసం రామతీర్థం, ఇస్కపల్లి, కాటేపల్లి, కోడూరు, మైపాడు బీచ్‌లకు భారీ సంఖ్యలో భక్తులు తరలివెళ్లారు. సముద్రస్నానాలు చేసి, ఉపవాస దీక్షలు చేపట్టారు. సమీప శివాలయాల్లో పాలభిషేకాల్లో పాల్గొన్నారు ఈ సందర్భంగా శివాలయాల్లో అన్నాభిషేకాలు, ప్రాకారోత్సవాలు, కార్తీక దీపాల అలంకరణలు, ఉత్సవాలు నిర్వహించారు. కార్తీక దీపాలతో ఆలయాలన్నీ కళకళలాడాయి.

● వెండినందిపై కామాక్షితాయి

బుచ్చిరెడ్డిపాళెం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని జొన్నవాడ ఆలయంలో సోమవారం రాత్రి మల్లికార్జునస్వామి, కామాక్షితాయి అమ్మవార్లు చిన్న వెండి నంది వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. శాశ్వత ఉభయకర్తలుగా దొడ్ల జానకమ్మ మల్లికార్జునస్వామికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అమ్మవారికి శ్రీచక్ర నవావరణ పూజలు నిర్వహింపచేశారు. ఆలయంలో భక్తులు శివలింగాకృతిలో కార్తీక దీపాలు వెలిగించారు.

● సైదాపురం మండలంలోని శ్రీసిద్దేశ్వరకోనలో నాలుగో కార్తీక సోమవారం తిరునాళ్ల నిర్వహించారు. ఈ సందర్భంగా నవకోటి సిద్దేశ్వర, నవనాథ సిద్దేశ్వర, శిష్యుడు సారంగధర స్వాములకు దేవరులు విశేష పూజలు నిర్వహించారు. 108 జంటలతో అన్నవరం సత్యనారాయణ స్వామి వ్రతం, అనంతరం కల్యాణం నిర్వహించారు.

● సీతారామపురం మండలంలోని శైవక్షేత్రలైన ఘటిక సిద్దేశ్వరం, భైరవకోన, సీతారామపురం శివాలయంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కార్తీక సోమవారం పూజలు నిర్వహించారు. భైరవకోన జలపాతంలో స్నానాలు చేసి దీపాలు వెలిగించారు.



బుచ్చి : జొన్నవాడలో చిన్న వెండి నంది వాహనంపై మల్లికార్జునస్వామి, కామాక్షితాయి



భైరవకోనలోని జలపాతం వద్ద కార్తీక స్నానాలు చేస్తున్న భక్తులు



నెల్లూరు : మూలస్థానేశ్వరాలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

- ఇటీవల జరిగిన గ్రామసభల్లో భూసమస్యలపై భారీగా అర్జీలు
- రాష్ట్రంలోనే అత్యధికంగా 8,406 ఫిర్యాదులు
- వీటి పరిష్కారంలో మాత్రం అట్టడుగున జిల్లా
- ఇప్పటికి పరిష్కరించింది 173, ఆన్‌లైన్ చేసినవి 3,058
- అధ్వానంగా రెవెన్యూశాఖ పనితీరు

కలెక్టర్ హెచ్చరించినా మారని అధికారుల ధోరణి

పరిష్కారమెప్పుడు?

నెల్లూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఏదైనా ఓ సమస్యను సులువుగా సృష్టించగలిగిన రెవెన్యూ అధికారులు.. ఆ సమస్యను పరిష్కరించడంలో మాత్రం చాలా కష్టపడుతున్నారు. గత ప్రభుత్వంలో అసలు పని వదిలి వైసీపీ నేతల సేవలో తరించిన రెవెన్యూ సిబ్బంది.. తద్వారా భూసమస్యలు పెరిగిపోవడానికి కారణమయ్యారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఆ భూసమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించింది. ఈ క్రమంలోనే ఇటీవల గ్రామసభలు నిర్వహించింది. ఈ సభల్లో ఊహకందని విధంగా రాష్ట్రంలోనే అత్యధికంగా అర్జీలు జిల్లాలో అందాయి. అయితే ఈ సమస్యల పరిష్కారం మాత్రం నత్తనడకన సాగుతోంది. ఈ సభలు ముగిసి పది రోజులు గడిచినా, ఇంతవరకు చాలా అర్జీలను ఆన్‌లైన్ చేయలేదంటే రెవెన్యూ శాఖ పనితీరు ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ప్రభుత్వం మారినా రెవెన్యూ శాఖ పనితీరులో మాత్రం మార్పు రావడం లేదు. ప్రజల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న పలువురు తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బందికి నోటీసులు జారీ చేస్తున్నప్పటికీ ఇంకా వారిలో మార్పు కనిపించడం లేదు.

● లెక్కకు మించి వినతులు

అక్టోబరు 19 నుంచి ఈనెల 14వ తేదీ వరకు గ్రామసభలు నిర్వహించగా మొత్తం 8406 అర్జీలు వచ్చాయి. ఇవన్నీ భూసమస్యలే కాగా, అందులో సర్వే విభాగానికి చెందినవి 3486 అర్జీలు ఉన్నాయి. వీటిలో ఇప్పటి వరకు 3058 అర్జీలను ప్రజా విజ్ఞప్తుల వేదిక(పీజీఆర్ఎస్)లో నమోదు చేశారు. ఇంకా సగానికిపైగా అర్జీలను ఆన్‌లైన్ చేయాల్సి ఉంది. అయితే, ఇప్పటి వరకు పరిష్కరించిన అర్జీల సంఖ్యను చూస్తే ముక్కున వేలేసుకోవాల్సిందే.! గత 19 నుంచి అర్జీలు వస్తుండగా ఇప్పటి వరకు కేవలం 173 మాత్రమే పరిష్కరించినట్లు సర్వే విభాగం లెక్కలు చెబుతున్నాయి. దీన్నిబట్టి రెవెన్యూ శాఖ పనితీరు ఏ విధంగా ఉందో స్పష్టమవుతోంది. రాష్ట్రంలోనే అత్యధిక అర్జీలు వచ్చింది నెల్లూరు జిల్లాలో కాగా, పరిష్కారంలో అట్టడుగున స్థానంలో ఉన్నది కూడా నెల్లూరు జిల్లానే కావడం గమనార్హం.

● తప్పించుకునే యత్నం

జిల్లాను ఇప్పుడు భూసమస్యలు అతలాకుతలం చేస్తున్నాయి. వైసీపీ ప్రభుత్వంలో భూ ఆక్రమణలు, భూ రికార్డుల మార్పులు ఎక్కువగా జరిగాయి. ఆ ఐదేళ్లలో తహసీల్దార్ స్థాయి నుంచి వీఆర్వో స్థాయి వరకు వంద మందికిపైగా సిబ్బంది సస్పెండ్ అయ్యారంటే నాడు ఏ విధంగా రెవెన్యూ శాఖ పనితీరు ఉందో అర్థం చేసుకోవచ్చు. రీసర్వే పుణ్యమా అంటూ కొత్త సమస్యలు కూడా వచ్చి పడ్డాయి. ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్న గ్రీవెన్స్‌లో సగానికి పైగా భూ సమస్యలే ఉంటుండడం గమనార్హం. అయితే ఈ భూసమస్యలను పరిష్కరించడంలో

- మిగతా 6లో..



సర్వేఅధికారి నాగశేఖర్‌కు వినతి ఇస్తున్న కాగితాలపూరు రైతులు (ఫైల్)

గ్రామసభల్లో వచ్చిన మొత్తం అర్జీలు	8,406
భూసర్వేకు సంబంధించిన సమస్యలు	3,486
ఇతర భూసమస్యలపై..	4,920
ఇప్పటి వరకు ఆన్‌లైన్ చేసినవి	3,058
ఇప్పటి వరకు పరిష్కరించినవి	173

వచ్చే నీళ్లతో వరి పండేనా?

- సోమశిల నుంచి రాళ్లపాడుకు రావాల్సింది 150 క్యూసెక్కులు
- వస్తున్నది 50 క్యూసెక్కులే..

● ఇలాగయితే ఆయకట్టులో సాగు ఎలా...? ● నీటి విడుదల పెంచాలంటున్న రైతులు

లింగసముద్రం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాళ్లపాడు ప్రాజెక్టులో ప్రస్తుతం ఉన్న నీటితోపాటు, సోమశిల ప్రాజెక్టు నుంచి వచ్చే 1.50 టీఎంసీల నీటితో వరిపైరు పండుతుందని ఆయకట్టు రైతులు ఆశించారు. అయితే సోమశిల నుంచి గొట్టిపాటి కొండపనాయుడు(జీకేఎన్) ఉత్తర కాలువ ద్వారా అరకొరగా నీరు వస్తున్నది. దీంతో ఆయకట్టు రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇలాగైతే ప్రాజెక్టులోని నీరు ఆయకట్టుకు సరిపోదని రైతులు చెబుతున్నారు.ప్రాజెక్టు ఆయకట్టు పరిధిలో నాలుగైదేళ్ల నుంచి వరి సాగు లేదు. ఈ ఏడాది ఎలాగైనా వరి పండించాలని, ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు కూడా ఉత్తర కాలువను వెడల్పు చేసి 1.50 టీఎంసీల నీటిని ఇవ్వాలని ఇటీవల అసెంబ్లీలో కోరారు. అంతేకాక గతనెలలో జిర్రావారిపాలెం వద్ద కూడా నీరు సరిగా రాకపోవడంతో ఇంటూరి సొంత నిధులతో కల్వర్టు నిర్మాణం చేయించారు. కానీ ప్రస్తుతం సోమశిల నుంచి రాళ్లపాడుకు కేవలం 50 క్యూసెక్కుల నీరు వస్తున్నట్టు అధికారు లు తెలి పారు.

● రాజోలు నుంచి ఉత్తర కాలువకు 200 క్యూసెక్కుల నీరు

సోమశిల ప్రాజెక్టు నుంచి 700 క్యూసెక్కుల నీరు విడుదల అవుతున్నా 67వ కిలోమీటరు వద్ద ఉన్న ఏఎస్‌పేట మండలం రాజోలు చెరువుకు కేవలం 220 కూసెక్కులకు మించి నీరు రావడం రాలేదు. అక్కడి నుంచి శ్రీకొలను, రాళ్లపాడు వైపు 180 నుంచి 200 క్యూసెక్కుల నీరు వస్తున్నట్టు అధికారులు తెలిపారు. రాజోలు చెరువు దిగువన ఉన్న శ్రీకొలను, మర్రిగుంట చెరువు వరకు ఉన్న వివిధ ఆయకట్టు భూములకు 150 క్యూసెక్కుల నీరు పోతుండడంతో రాళ్లపాడుకు కేవలం 50 క్యూసెక్కుల నీరు మాత్రమే వస్తోంది. అయితే రాజోలు చెరువుకు 300 కూసెక్కుల నీరు వచ్చి, 280 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదలైతే అక్కడి నుంచి శ్రీకొలను ఇతర ఆయకట్టుకు 180 క్యూసెక్కుల నీరు పోయినా, రాళ్లపాడుకు వంద క్యూసెక్కుల నీరు వచ్చే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు.అధికారులు ఈ దిశగా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

● డైవర్షన్ నిర్మించాలి

సోమశిల నుంచి వచ్చే నీరు మర్రిగుంట చెరువులోకి వెళ్లకుండా డైవర్షన్ నిర్మించి, అక్కడి నుంచి నేరుగా మర్రిగుంట చెక్‌డ్యామ్ నుంచి రాళ్లపాడుకు వచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. సోమశిల నీరు రాజోలు చెరువుకు వెళ్లకుండా ప్రస్తుతం ఆ చెరువు వద్ద డైవర్షన్ పనులు జరుగుతున్నాయని, ఉత్తర కాలువ వెడల్పు పనులు కూడా సాగుతున్నాయని ప్రాజెక్టు అధికారులు తెలిపారు.ఈ ప్యాకేజీలో మర్రిగుంట చెరువు డైవర్షన్ పనులు చేసేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



సోమశిల ఉత్తర కాలువ (ఉప్పుటేరు) నుంచి అరకొరగా మర్రిగుంట చెరువుకు వస్తున్న నీరు


ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటుకు యత్నాలు

● ఆమంచర్లలో వివాదాస్పద భూమి పరిశీలన ● త్వరలో కలెక్టర్‌కి నివేదిక : ఆర్డీవో

నెల్లూరు (వెంకటేశ్వరపురం), నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు రూరల్ మండలం ఆమంచర్ల ప్రాంతంలోని వివాదాస్పద భూమిని సోమవారం నెల్లూరు ఆర్డీవో అనూష ఆధ్వర్యంలో అటవీ, (ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్) ఏపీఐఐసీ అధికారుల బృందం పరిశీలించారు. జిల్లాలో మైక్రో స్మాల్ మీడియం ఎంటర్‌ప్రైజెస్(ఎంఎస్ఎంఈ) పార్కు ఏర్పాటు కోసం ఏపీఐఐసీ దాదాపు రూ.55 కోట్లు చెల్లించి, 550 ఎకరాల భూమిని 2016లో రెవెన్యూశాఖ నుంచి కొనుగోలు చేసింది. పార్కుకు శంకుస్థాపన చేసేందుకు ప్రయత్నించే సమయంలో అటవీశాఖ అధికారులు అభ్యంతరం వ్యక్తం చేశారు. రెవెన్యూకి కేటాయించిన భూమి రిజర్వుఫారెస్ట్ పరిధిలో ఉందని, ఇందులో పార్కు ఏర్పాటు చేయరాదని తేల్చి చెప్పారు. అయితే, గత వైసీపీ ప్రభుత్వం ఈ సమస్యపై ఎలాంటి చర్యలు చేపట్టలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పరిశ్రమల ఏర్పాటుపై దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో ఆమంచర్లలోని ఎంఎస్ఎంఈ భూమి వివాదాన్ని పరిష్కారించే దిశగా అధికారులు చర్యలు ప్రారంభించారు. ఈ క్రమంలో జిల్లా కలెక్టర్ ఆనంద్ ఆదేశాలతో నెల్లూరు ఆర్డీవో అనూష ఆధ్వర్యంలో అటవీశాఖ, ఏపీఐఐసీ అధికారులు సోమవారం ఉదయం ఆమంచర్లలోని వివాదాస్పద భూమిని పరిశీలించారు. అటవీశాఖ మ్యాప్‌లను పరిశీలించారు. రెవెన్యూశాఖ రికార్డులను పరిశీలించి పూర్తి నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని ఆర్డీవో తెలిపారు. ఆర్డీవో వెంట ఏపీఐఐసీ జెడ్ఎం వీరశేఖరరెడ్డి, డీజెడ్ఎం వెంకటసురేష్, నెల్లూరు ఫారెస్ట్ రేంజర్ మాల్యాద్రి, రెవెన్యూ అధికారులు ఉన్నారు.



ఎంఎస్ఎంఈ పార్క్ స్థలం మ్యాపును పరిశీలిస్తున్న ఆర్డీవో అనూష, ఫారెస్ట్, ఏపీఐఐసీ అధికారులు



కానరాని క్లోరినేషన్

- కొరవడిన అధికారుల పర్యవేక్షణ
- గ్రామాల్లో శుభ్రతలేని తాగునీటి ట్యాంకులు
- బోర్డులు తప్ప రాతలు ఏవీ ?

6

వరినాట్లు నిలిపివేయాలి

అల్లూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): వాతావరణ శాఖ సూచన మేరకు మంగళవారం నుంచి ఈనెల 28వ తేదీ వరకు జిల్లాకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులు వరినాట్లు వేయరాదని మండల వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు సోమవారం ఓ ప్రటనలో తెలిపారు. వారం రోజుల నుంచి వరినాట్లు ముమ్మరంగా జరుగుతున్న నేపథ్యంలో జిల్లాకు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నాయని పేర్కొన్నారు. కలెక్టరు ఆదేశాలతో రైతులు తమ పొలాల వద్ద ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు.

గృహ నిర్మాణాలకు దరఖాస్తు చేసుకోండి

కందుకూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం సహకారంతో సొంత ఇంటి నిర్మాణానికి అర్హులైన నిరుపేదలంతా పీఎంఏవై స్కీం ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం (నేడు) మీ పరిధిలోని గ్రామ సచివాలయంలో ఆన్‌లైన్ ద్వారా గృహ మంజూరుకు దరఖాస్తు చేసుకుని సంబంధిత డాక్యుమెంట్లు అందజేయాలని ఆయన తెలిపారు.

వైరల్ ఫీవర్... ఫీవర్

- ఎక్కడ చూసినా జ్వరపీడితులే..
- పెరుగుతున్న అస్తమా, నిమోనియా, బ్రాంకైటిస్ వ్యాధులు
- వాతావరణ మార్పులతోనే అనారోగ్యాలు
- తస్మాత్ జాగ్రత్త అంటున్న వైద్యులు

నెల్లూరు (వైద్యం) నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుతం జిల్లాలో చోటుచేసుకున్న వాతావరణ మార్పులతో వైరల్ ఫీవర్, డెంగ్యూ జ్వరం, అస్తమా, నియోనియా, బ్రాంకైటిస్ తదితర వ్యాధులు ప్రబలుతున్నాయి. ఇప్పటికే పలువురు వ్యాధిగ్రస్థులు వివిధ ఆసుపత్రుల్లో చికిత్సలు పొందుతున్నారు. ఈ వ్యాధులపై ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రాణాంతకంగా మారే అవకాశం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఇటీవల జిల్లాలో విస్తారంగా వర్షాలు కురిసి, చలితీవ్రత పెరుగుతోంది. దీనికితోడు వ్యాధుల సీజన్ కావటంతో విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. ఎక్కడ చూసినా డెంగ్యూ కేసులు నమోదు అవుతుండడంతో బాధితులు ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులకు పరుగులు తీస్తున్నారు.

● వేలల్లో జ్వరపీడితులు

జిల్లాలో 20వేలకుపైగా జ్వరపీడితులు నమోదయ్యారని వైద్య ఆరోగ్యశాఖ గణాంకాలు చెబుతున్నాయి. అయితే ఇందుకు ఆరురెట్లు అధికంగా జ్వరాల కేసులు ఉన్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులకు వచ్చే వ్యాధిగ్రస్థుల్లో ప్రస్తుతం జ్వరాల కేసులే 40 శాతం ఉంటున్నాయంటే జ్వరాల నమోదు ఎలా ఉందో తెలుస్తుంది. స్థానికంగా ఉన్న గ్రామీణ వైద్యులను ప్రతిరోజూ పదుల సంఖ్యలో జ్వరపీడితులు కలుస్తూ చికిత్స చేయించు కుంటున్నారు. జిల్లా వ్యాప్తంగా 52 పీహెచ్‌సీలు ఉండగా గత వారం రోజుల్లో ఆయా పీహెచ్‌సీల పరిధిలో 100 మందికిపైగా జ్వరాల బాధితులు నమోదయ్యారని వైద్యాధికారులు చెబుతున్నారు. ఇక ఏరియా, జిల్లా ఆసుపత్రులతోపాటు, నెల్లూరులోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి రోజూ వేలకు మందికిపైగా వివిధ రకాల రోగులు వస్తుండగా, ఇందులో జ్వరపీడితులు ఎక్కువగానే ఉన్నారు. ఇక జిల్లాలో రెండు వేలకుపైగా ప్రైవేట్ ఆసుపత్రులు ఉండగా ఇక్కడకు వచ్చే

- మిగతా 6లో..



జీజీహెచ్‌లో ఓపీ కోసం క్యూలో ఉన్న బాధితులు

● కావలి రూరల్ మండలానికి చెందిన సుగుణమ్మ వాతావరణ మార్పుల కారణంగా తీవ్రంగా అస్తమాకు గురైంది. ఊపిరి ఆడక ఇటీవల నెల్లూరులోని వైద్య నిపుణులను సంప్రదించారు. వారు పూర్తిస్థాయి పరీక్షలు నిర్వహించి అస్తమా ఎక్కువగా ఉందని, నాలుగు రోజులు ఆసుపత్రిలో ఇన్‌పేషెంట్‌గా చేర్చుకుని వైద్యచికిత్సలు అందించారు. వ్యాధి తీవ్రత తగ్గాక డిశ్చార్జ్ చేశారు. ప్రస్తుతం బాధితురాలు కొంత వరకు కోలుకుంది. వైద్యుడు రాసిన మందులతోపాటు పీల్చే మందులు కూడా వాడుతోంది.

● ఇందుకూరుపేటకి చెందిన వెంకట్రామయ్య తీవ్ర అనారోగ్యంతో స్థానిక ఆసుపత్రిలో వైద్యం చేయించుకున్నా జ్వరం తగ్గుముఖం పట్టలేదు. ఇక లాభంలేదని నెల్లూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా, అతడికి డెంగ్యూ లక్షణాలు ఉన్నట్లు నిర్ధారణ అయింది. ప్లేట్లేట్లు 10వేలకు పడిపోవటంతో బాధితుడిని కుటుంబ సభ్యులు మెరుగైన చికిత్స కోసం చెన్నైకి తరలించారు. ప్రస్తుతం బాధితుడు కోలుకుంటున్నారు.



భైరవకోనకు పోటెత్తిన భక్తులు

కార్తీక మాసం చివరి సోమవారం సందర్భంగా మండలంలోని శైవ క్షేత్రాలైన ఘటిక సిద్దేశ్వరం, భైరవకోన, సీతారామపురంలోని శివాలయాలకు అధిక సంఖ్యలో భక్తులు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు కార్తీక దీపాలు వెలిగించి పరమశివుడికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు శివునికి ప్రత్యేక రుద్రాభిషేకాలు, పంచామృతాభిషేకం, బిల్వార్చనలు చేశారు. భక్తులు స్వామివారికి ఇష్టమైన బిల్వపత్రాలు, నాగలింగ పుష్పాలతో పూజలో పాల్గొన్నారు.

- సీతారామపురం (ఆంధ్రజ్యోతి)



కఠిన చట్టాలతో అత్యాచారాలు అరికట్టాలి

సమాజంలో మహిళలు, చిన్నారులపై జరుగుతున్న అత్యాచారాల నిర్మూలనకు కేంద్ర ప్రభుత్వం కఠినమైన చట్టాలు తీసుకురావాలని రాపూరులో సోమవారం గ్రామీణ నిర్మూలన సంస్థ వెలుగు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం సంఘమిత్రలతో వెలుగు ఏపీఎం రాధమ్మ ప్రతిజ్ఞ చేయించారు. ఆమె మాట్లాడుతూ సమాజంలో బాల్య వివాహాలను అరికడతామని, బాల్య బలవంతపు వివాహాలు, గృహహింసను వ్యతిరేకిస్తామని తెలిపారు. ర్యాలీలో పొదుపు సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

- రాపూరు (ఆంధ్రజ్యోతి)

అందెల రవళి

పువ్వు పుట్టగానే పరిమళిస్తుదన్న సత్యాన్ని జాహ్నవి రుజువుచేశారు. దేశ,విదేశాల్లో ఆమె 800కిపైగా ప్రదర్శనలు ఇచ్చి పలు జాతీయ, అంతర్జాతీయ అవార్డులు సొంతం చేసుకున్నారు. నృత్యమే ప్రాణంగా భావించిన ఆమె కూచిపూడిలో డిప్లమా, పీజీ పూర్తిచేసుకుని, భావితరాలకు నాట్యకళను అందించాలన్నా సంకల్పంతో జయం కూచిపూడి నాట్యాలయాన్ని స్థాపించారు.



నృత్య భంగిమలో జాహ్నవి

- నాట్యాచారిణిగా జాహ్నవి
- ఎంతోమందికి కూచిపూడిలో శిక్షణ
- 800కిపైగా ప్రదర్శనలు
- పలు జాతీయ, అంతర్జాతీయ అవార్డుల కైవసం

తిరుపతి జిల్లా నాయుడుపేటకి చెందిన మధుసూదన్‌రావు-ఉషారాణి దంపతుల కుమార్తె జాహ్నవి. చిన్నతనం నుంచే నాట్యంపై మక్కువ పెంచుకుంది. కావలిలో అమ్మమ్మ జమున వద్ద ఉంటూ చదువుకుంది. టీవీల్లో కూచిపూడి, భరతనాట్యం, జానపద నృత్యాలను తిలకిస్తూ నాట్య సాధన చేసేది.

● హైదరాబాద్‌లో నృత్యశిక్షణ

జాహ్నవి ఆసక్తిని గుర్తించిన అమ్మమ్మ హైదరాబాదులోని ప్రముఖ నాట్యాచార్యులు వేదాంతం సత్యనరసింహశాస్త్రి వద్ద శిక్షణ ఇప్పించారు. గురువు వద్ద రోజుకు రెండు గంటల శిక్షణ , మరో రెండుగంటలు సాధన చేస్తూ నాట్యంలో మెలకువలు నేర్చుకుంది. కూచిపూడిలోని 48 ముద్రలు వంటపట్టించుకుని ప్రదర్శనలివ్వసాగింది. జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రదర్శనలు ఇచ్చింది. ఎన్నో అవార్డులు సొంతం చేసుకుంది.

● ప్రముఖుల నుంచి ప్రశంస

అప్పటి సీఎంలు చంద్రబాబు, వైఎస్ రాజశేఖర్ రెడ్డి, షీలా దీక్షిత్, కేంద్ర మంత్రులు వెంకయ్య నాయుడు, జైరామ్ రమేష్, పురంధేశ్వరి, పనబాక లక్ష్మి, గవర్నర్లు రంగరాజన్, రామేశ్వర్ ఠాకూర్, రమాదేవి, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, పొంగూరు నారాయణ, ఆనం రామనారాణ రెడ్డి, దేవినేని ఉమ, కొల్లు రవీంద్ర తదితర ప్రముఖుల నుంచి ప్రశంలందుకున్నారు.

● నాట్యాలయ స్థాపన

జాహ్నవి వివాహనంతరం అమ్మమ్మ ప్రోత్సాహంతో 2017లో జయం కూచి పూడి నాట్యాలయాన్ని స్థాపించారు. ఇప్పటి వరకు ఎంతో మంది చిన్నారులను చేరదీసి నాట్యంలో శిక్షణ ఇచ్చారు. శిష్యబృందం కూడా దేశం నలుమూలల పలు ప్రదర్శనలందిస్తూ ప్రశంసలు అందుకుంటున్నారు.

● సామాజిక సేవలోనూ...

జాహ్నవి విద్యాదశ నుంచే సామాజిక సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకుంటున్నారు. ఎన్‌సీసీ కేడెట్‌గా, ఎన్ఎస్ఎస్ వలంటీర్‌గా పర్యావరణ పరిరక్షణ, బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన, వన సంరక్షణ, బాలికా విద్య, బాల్య వివాహాల నిర్మూలన, మద్యపాన నిర్మూలన తదితర కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కూచిపూడి కళ అంతరించకుండా విస్తరించడం జీవిత ఆశయమని జాహ్నవి పేర్కొన్నారు.

- కావలి టౌన్ (ఆంధ్రజ్యోతి)



జాహ్నవి శిష్యులను సర్టిఫికెట్లతో అభినందిస్తున్న ప్రముఖ నాట్యాచార్యుడు వేదాంతం రామలింగేశ్వరశాస్త్రి



తన వద్ద నాట్యం నేర్చుకుంటున్న విద్యార్థులతో జాహ్నవి

గిన్నిస్ బుక్‌లో స్థానం

జాహ్నవి హైదరాబాదులోని గచ్చిబౌలిలో జరిగిన అంతర్జాతీయ కూచిపూడి నృత్యోత్సవాల్లో పాల్గొని గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించింది. ఢిల్లీలో జరిగిన జాతీయ స్థాయి కూచిపూడి నృత్య ప్రదర్శనలో ఎక్సలెన్స్ పర్ఫార్మెన్స్ అవార్డు, 2012 సింగపూర్‌లో జరిగిన ఒలింపియాడ్స్‌లో ప్రతిభ కనబరచడంతో నాట్యబాల అవార్డు అందుకున్నారు. ఆమె ప్రదర్శనలకు మెచ్చి నర్తనబాల, బాలమేధావి, నాట్యబాల, నాట్యజ్యూరీ, నాట్య మయూరి తదితర అవార్డులు ప్రదానం చేశారు.

వైరల్ ఫీవర్.. ఫీవర్ !

(5వ పేజీ తరువాయి)

రోగులలో డెంగ్యూ వ్యాధిగ్రస్థుల సంఖ్య ఆందోళన కలిగిస్తుంది. జిల్లా వ్యాప్తంగా 26.60 లక్షల మంది జనాభా ఉండగా, ప్రస్తుతం 60 వేలమందికిపైగా జ్వరపీడితులు ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి.

● అవగాహన ఏదీ ?

వైద్య ఆరోగ్యశాఖ ప్రజారోగ్యం కోసం రూ.కోట్లలో ఖర్చు చేస్తున్నా విషజ్వరాలు డెంగ్యూ, మలేరియా, నెమ్ము వ్యాధులపై మాత్రం తగిన ప్రచారం లేదు. ప్రజలకు అవగాహన కల్పించడంలో ఆ శాఖ వైఫల్యం చెందింది. వ్యాధులపై అవగాహన కల్పించే అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో ఉన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సైతం ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు అందుబాటులో ఉన్నారు. అయితే చిన్నపాటి జ్వరాలపై కూడా ప్రజలను అప్రమత్తం చేయడంలో వారు విఫలమవుతున్నారు. ఈ చలికాలంలో ప్రాణాంతకమైన దోమల సంఖ్య కూడా విపరీతంగా పెరిగే అవకాశం ఉంది. దీనిపై ప్రజలను అప్రమత్తం చేయాల్సిన శాఖాధికారులు అటు వైపు కూడా చూడడం లేదు.



నెల్లూరు పెద్దాసుపత్రిలో చికిత్స పొందుతున్న జ్వర పీడితులు



వాతావరణ మార్పులతోనే వ్యాధులు

ప్రస్తుతం వాతావరణంలో వస్తున్న మార్పుల వల్ల నెమ్ము వ్యాధులు వస్తున్నాయి. డెంగ్యూ, విషజ్వరాలు కేసులు కూడా ఎక్కువగా నమోదవుతున్నాయి. ఎంతకూ తగ్గని జ్వరం ఉంటే డెంగ్యూ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలి. అయితే కొంతమంది ప్లెట్లేట్‌లు తగ్గాయని ఆందోళన చెందుతూ చెన్నై తదితర ప్రాంతాలకు పరుగులు తీస్తున్నారు. ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

- డాక్టర్ కాలేషా సాహెబ్, అసోసియేట్ ప్రొఫెసర్, జీజీహెచ్



ఈ సీజన్‌లో జాగ్రత్తలు అవసరం

ప్రస్తుత సీజన్‌లో ఎక్కువగా వైరల్ ఫీవర్‌లు వస్తున్నాయి. మలేరియా, డెంగ్యూ కేసులు అధికంగా నమోదవుతున్నాయి. ప్రభుత్వ ఆసుపత్రుల కంటే ప్రైవేట్ ఆసుపత్రులలోనే కేసులు ఎక్కువగా ఉంటున్నాయి. విషజ్వరాలు ఉన్నవారు,సాధారణ జ్వరపీడితులు వ్యాధి తీవ్రతను బట్టి డెంగ్యూ పరీక్షలు చేయించుకోవాలి. వైరల్ ఫీవర్‌పై ప్రతి ఒక్కరూ అప్రమత్తగా ఉండాలి.

- డాక్టర్ ఎంవీ రమణయ్య, ప్రజారోగ్య పరిరక్షణ వేధిక రాష్ట్ర అధ్యక్షుడు

పరిష్కారమెప్పుడు ?

(5వ పేజీ తరువాయి)

రెవెన్యూ యంత్రాంగంలో నిర్లక్ష్యం కనిపిస్తోంది. క్షేత్రస్థాయిలో రెవెన్యూ సిబ్బంది తప్పించుకునే ప్రయత్నాలు చేస్తున్నారు తప్ప సమస్యను పరిష్కరిద్దామన్న ఉద్దేశం చాలా మందిలో కనిపించడం లేదని ఆ శాఖవర్గాలే చెబుతున్నాయి. బాధితుడి ఫిర్యాదుకు తూతూమంత్రంగా సమాధానం ఇచ్చి ముగించేస్తున్నారు. ఆ సమస్యతో మళ్లీ బాధితుడు ఉన్నతాధికారుల వద్దకు పరిగెడుతున్నాడు. ఇప్పుడు గ్రామసభల్లో కూడా వచ్చిన అర్జీలు, వాటి పరిష్కార వేగం చూస్తుంటే.. వచ్చిన 8406 అర్జీలను పరిష్కరించడానికి ఎన్ని సంవత్సరాలు సమయం తీసుకుంటారోనన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

● కలెక్టర్ మెమోలు జారీ చేసినా..

గ్రీవెన్స్‌లో వచ్చిన అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న తహసీల్దార్లకు ఇటీవల కలెక్టర్ ఓ ఆనంద్ మెమోలు జారీ చేశారు. ఇలాగైనా మిగిలిన వారిలో మార్పు వస్తుందని అనుకుంటే ఆ పరిస్థితులు కనిపించేలా లేవని రెవెన్యూ వర్గాలు గుసగుసలాడుకుంటున్నాయి. భూ సమస్యల అర్జీలు స్వీకరించడానికి ప్రత్యేకంగా 329 గ్రామాల్లో సభలు నిర్వహించారు. ఇప్పుడు వాటిని పరిష్కరించడానికి కూడా ప్రత్యేక డ్రైవ్‌లు ఏర్పాటు చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఓ వైపు తమ సమస్యను ఎప్పుడు పరిష్కరిస్తారా..? అని బాధితులు కళ్లల్లో ఒత్తులేసుకొని ఎదురుచూస్తున్నారు. నిత్యం రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా ఉన్నతాధికారులు గ్రామసభల్లో వచ్చిన అర్జీలు పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అంతర్ జిల్లా నేరస్థుడికి రిమాండ్

ఉలవపాడు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రెండేళ్లుగా జాడ తెలియకుండా తిరుగుతున్న అంతర్ జిల్లా నేరస్థుడిని సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ అంకమ్మ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. చీరాల వద్ద ఈపురుపాలెంకు చెందిన కుంజా దుర్గాప్రసాద్ అలియాస్ గణ జాతీయ రహదారిపై రాత్రుళ్లు ఆగి ఉన్న లారీలు, కార్లను టార్గెట్ చేసి డ్రైవర్లు నిద్రిస్తున్న సమయంలో నగదు, సెల్‌ఫోన్‌లు దొంగతనం చేస్తుంటాడు. 2022లో ఉలవపాడు జాతీయ రహదారిపై ఆగి ఉన్న కారు నుంచి భారీగా నగదు చోరీ అయినట్లు కేసు నమోదు అయ్యింది. అంతేకాకుండా పలు పోలీస్ స్టేషన్‌ల్లో సదరు నిందితుడిపై వివిధ రకాల కేసులు నమోదు అయ్యాయి. అప్పటినుంచి అతని జాడపై నిఘా ఉంచి అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రాజ్యాంగ దినోత్సవ పోటీల్లో జిల్లా విద్యార్థుల ప్రతిభ



అధికారుల నుంచి సర్టిఫికెట్ అందుకుంటున్న విద్యార్థిని

నెల్లూరు(విద్య), నవంబరు 25(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ దినోత్సవ పోటీల్లో జిల్లా విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ చూపి విజేతలుగా నిలిచారు. గుంటూరులో జోనల్ స్థాయిలో జరిగిన ఈ పోటీల్లో డిబేట్ విభాగంలో సీబీ నగర్ నగరపాలక పాఠశాల విద్యార్థులు ఏ.ప్రవీణ్, విష్ణువర్ధన్‌లు ప్రథమస్థానం, వ్యాసరచన పోటీల్లో గండవరం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని బి.సుచిత్ర ప్రథమస్థానం, వక్తృత్వ పోటీల్లో చెన్నపల్లిపాళెం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని బి.లాలస ద్వితీయస్థానం, దేశభక్తి గీతాల విభాగంలో గండవరం జడ్పీ పాఠశాల విద్యార్థిని బి.సుచిత్ర తృతీయస్థానంలో నిలియారు. వీరు అన్ని విభాగాల్లో విజేతలుగా నిలిచేందుకు డీఈవో డాక్టర్ ఆర్.బాలాజీరావు, డిప్యూటీ ఈవోలు ప్రసన్నలక్ష్మి, రఘురామయ్య, ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు పూర్తి సహకారం అందించారని ఉపాధ్యాయులు ఫణికుమార్, కట్టా సురేష్, పుల్లయ్య, ఖాదర్‌బాషాలు తెలిపారు.

జాతీయస్థాయి పోటీలకు చాకిచర్ల విద్యార్థి

ఉలవపాడు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : చాకిచర్ల జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఊటుకూరి వెంకట శ్రీరామ్ ఈ నెల 27న బీహార్ రాష్ట్రం పట్నాలో జరిగే జాతీయస్థాయి షూటింగ్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు జనార్దన్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని సోమవారం పాఠశాలలో హెచ్‌ఎంతో పాటు ఉపాధ్యాయులు, పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ ఆర్ సుధాకర్, విద్యార్థులు, గ్రామ పెద్దలు అభినందనలు తెలిపారు. ఉత్తమ ప్రతిభ ప్రదర్శించి జాతీయస్థాయిలో గ్రామం, పాఠశాల పేరు నిలపెట్టాలని ఆకాంక్షించారు.



శ్రీరామ్‌ను అభినందిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

కానరాని క్లోరినేషన్

- కొరవడిన పర్యవేక్షణ
- గ్రామాల్లో శుభ్రతలేని నీటి ట్యాంకులు
- బోర్డులు తప్ప రాతలు ఏవీ ?

మనుబోలు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత వర్షాకాలంలో గ్రామీణులకు స్వచ్ఛమైన తాగునీటిని అందించాల్సిన బాధ్యత పంచాయతీ పాలకులపై ఉంది. కుళాయిల నుంచి వచ్చే నీటిని క్లోరినేషన్ చేసి విడుదల చేయాల్సి ఉంది. లేకుంటే సీజనల్ వ్యాధులు ప్రబలేఅవకాశం ఉంది. అయితే, ఎప్పుడో పారిశుధ్య వారోత్సవాలు, మాసోత్సవాలు నిర్వహించినప్పుడు మాత్రమే క్లోరినేషన్ చేసి చేతులు దులుపుకుంటున్నారు. గత పాలనలో పంచాయతీ నిధులు దారిమళ్లించడంతో బ్లీచింగ్ అనేది కానరాలేదు. ఎమ్మెల్యే, కలెక్టర్, ఇతర అధికారులు ఎవరైనా పర్యటిస్తారం టేనే బ్లీచింగ్ చల్లి వదిలేస్తారు. వారానికి ఒకసారి తప్పనిసరిగా తాగునీటి ట్యాంకుల్లో క్లోరినేషన్ చేయాలి. ప్రతి 15రోజులకొకసారి ట్యాంకులను శుభ్రం చేయించాలి. ట్యాంకుల వద్ద ఏర్పాటుచే సిన బోర్డుపై ఎప్పుడు శుభ్రం చేశారన్నది రాసిఉంచాలి. కానీ అలాంటి కార్యక్రమాలు చాలా పంచాయతీల్లో కానరావడం లేదు. మండలంలో 19 పంచాయతీలతోపాటు 80 మజరాలు ఉన్నాయి. వీటిల్లో 33రక్షిత మంచి నీటి ట్యాంకులు, రెండు మినీరక్షిత మంచినీటి ట్యాంకుల ఉన్నాయి. ఇవికాక 49చోట్ల నేరుగా కుళాయిలకే తాగునీటిని వదులుతున్నారు. 33 నీటి ట్యాంకుల్లో పదికిపైనే దెబ్బతిన్నాయి. అయితే వీటిపై అధికారుల పర్యవేక్షణ అంతంత మాత్రంగానే ఉంది. గతంలో డీపీవో ఓ పంచాయతీ తనిఖీ చేసినప్పుడు ఒకసారి శుభ్రం చేసిన ఫొటోనే పలుమార్లు పెట్టి ప్రతి నెలా శుభ్రం చేస్తున్నట్లు చూపారు. దీన్ని గుర్తించి ఆ కార్యదర్శిని ఆమె మందలించారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులు ఇకనైనా ట్యాంకుల్లో క్లోరినేషన్ జరిగేలా చర్యలు చేపట్టాలి.



ట్యాంకు బోర్డుపై కానరాని రాతలు



దెబ్బతిన్న జట్లకొండూరు ట్యాంకు మెట్లు



కందుకూరులో వసతులు మెరుగుపరచండి

కందుకూరులోని నివాస ప్రాంతాల్లో సమస్యలు పరిష్కరించాలని, మౌలిక వసతులు మెరుగుపరచాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో మహిళలు, స్థానికులు సోమవారం స్థానిక సీపీఎం కార్యాలయం నుంచి సబ్ కలెక్టరు కార్యాలయం వరకు నిరసన ప్రదర్శన చేపట్టారు. పట్టణంలోని ట్రాఫిక్ సమస్య పరిష్కరించాలని, రూరల్ పోలీస్‌స్టేషన్ నుంచి కోటారెడ్డి హాస్పటల్ వరకు, పంచాయతీరాజ్ ఆఫీసు నుంచి ఆక్స్‌ఫర్డ్ స్కూల్ వరకు రోడ్డుకు ఇరువైపులా ప్రమాదకరమైన మ్యాన్‌హోల్స్ ఉన్నాయని తక్షణమే వాటికి మరమ్మతులు చేయించాలని కోరారు. అనంతరం సబ్ కలెక్టరు శ్రీపూజకు సమస్యలు వివరిస్తూ వినతిపత్రం అందజేశారు.

- కందుకూరు (ఆంధ్రజ్యోతి)

'రామదూత స్వామిని అరెస్టు చేయాలి'

నెల్లూరు(సాంస్కృతికం), నవంబరు 25(ఆంధ్రజ్యోతి): కందుకూరు నియోజకవర్గంలోని తెట్టు మండపం చేవూరు వద్ద 25 ఏళ్లుగా ప్రభుత్వ భూమిని ఆక్రమించి ఆశ్రమం నడుపుతున్న రామదూత స్వామిని అరెస్టు చేసి ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలని హేతువాద సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నార్నే వెంకటసుబ్బయ్య డిమాండ్ చేశారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గత ప్రభుత్వం విశాఖపట్నం వద్ద రూ.250కోట్లు విలువ చేసే భూమిని స్వరూపానందస్వామికి కారుచౌకగా ధారాదత్తం చేస్తే ప్రస్తుత ప్రభుత్వం స్వాధీనం చేసుకుందని తెలిపారు. రామదూత ఆక్రమించిన ప్రభుత్వ భూమికి కందుకూరు ఆర్డీవో ఆన్‌లైన్ చేయడం ఏమిటని ప్రశ్నించారు. గతంలో రాష్ట్ర ప్రిన్సిపల్ కార్యదర్శి ఇచ్చిన రద్దు ఉత్తర్వులపై జిల్లా కలెక్టర్, తహసీల్దారు నాటకాలు ఆడుతున్నారని తెలిపారు. తాజాగా స్వామీజీ ఆక్రమించిన భూమి ఎకరా రూ.15కోట్లు విలువ చేస్తుండగా దానిని కారుచౌకగా స్వామీజీకి విక్రయించేందుకు కొత్త ప్రతిపాదనలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. స్వామీజీలకు చౌకగా భూములు కట్టబెట్టి గత ప్రభుత్వం తెచ్చుకున్న చెడ్డపేరును రామదూత విషయంలో తెచ్చుకోవదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా హేతువాద సంఘంగా నాయకులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

నెల్లూరు(క్రైం), నవంబరు 25(ఆంధ్రజ్యోతి): నెల్లూరు రూరల్ పరిధిలోని వెంగళరావు నగర్‌కు చెందిన ఏసుపాదం అదృశ్యంపై వేదాయపాలెం పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. వెంగళరావునగర్‌కు చెందిన పిట్టి ఏసుపాదంకు వివాహమై కుమార్తె ఉన్నారు. అతను పెయింటింగ్ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఆ క్రమంలో ఈనెల 24వ తేది రాత్రి ఏసుపాదంకు తెలిసిన వ్యక్తులు ఇంటికి వచ్చి ఏదో పని ఉందని తీసుకువెళ్లారని, అప్పటి నుంచి అతను తిరిగి ఇంటికి రాలేదని కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇలాగైతే ప్రమాదమే ?



రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసు, వాహన తనిఖీ అధికారులు ఏటా రోడ్డు భద్రతా వారోత్సవాల్లో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నా కొందరికి చెవికెక్కడం లేదు. సోమవారం ముంబయి జాతీయ రహదారిపై ఓ కుటుంబంలో భర్త, భార్య, ముగ్గురు పిల్లలు మొత్తం ఐదుగురు మోటారుబైక్‌పై ప్రయాణం సాగించారు. మోటారుబైక్ ఏమాత్రం అదుపుతప్పి ప్రమాదం జరిగితే అంతే సంగతులు.

- సంగం, (ఆంధ్రజ్యోతి)

అంతర్ కళాశాలల క్రీడల

ఛాంపియన్ జవహర్ భారతి

నెల్లూరు(విద్య), నవంబరు 25(ఆంధ్రజ్యోతి): విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం మహిళా అంతర్ కళాశాలల ఛాంపియన్‌షిప్‌ను కావలి జవహర్‌భారతి(జేబీ) కళాశాల కైవసం చేసుకుంది. నగరంలోని డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో మూడు రోజులు జరిగిన పోటీల్లో బాస్కెట్‌బాల్ విభాగంలో అలెక్సా ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల ప్రథమ, జేబీ ద్వితీయస్థానం, వాలీబాల్ విభాగంలో జేబీ ప్రథమ, అలెక్సా కళాశాల ద్వితీయం, ఖోఖో పోటీల్లో డీకే ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రథమ, జేబీ ద్వితీయస్థానం, హ్యాండ్ బాల్ విభాగంలో అలెక్సా కళాశాల ప్రథమ, జవహర్ భారతి ద్వితీయస్థానం సాధించాయి. బాల్‌బ్యాడ్మింటన్‌లో 'అలెక్సా' ప్రథమ, డీకేడబ్ల్యూ కళాశాల ద్వితీయస్థానం సాధించాయి. అలాగే యోగాలో జెనెక్స్ ప్రథమ, డీకే ప్రభుత్వ డిగ్రీ కళాశాల ద్వితీయస్థానం, టగ్ ఆఫ్ వార్‌లో గూడూరు డీఆర్‌డబ్ల్యూ ప్రథమ, డీకేడబ్ల్యూ కళాశాల ద్వితీయస్థానం సొంతం చేసుకున్నాయి. విజేతలకు డీకేడబ్ల్యూ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.గిరి సతీమణి గాయత్రి బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో పోటీల నిర్వాహకులు సి.విజయకళ, పీడీలు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.



ఎట్టకేలకు ప్రారంభం!



ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కలువాయి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): నిరుపయోగంగా రైతు సేవా యంత్రాలు శీర్షికన సోమవారం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితం కావడంతో వ్యవసాయశాఖ అధికారులు స్పందించారు. మండల వ్యవసాయాధికారి వీ ప్రతాప్ ఆదేశాల మేరకు పలు రైతు సేవా కేంద్రాల్లో సిబ్బంది యంత్రాలను ఆన్‌చేశారు. కలువాయి రైతు సేవా కేంద్రంలో మిషన్ ఆన్‌చేసి ఏవో, విస్తరణ అధికారి సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. అన్ని కేంద్రాల్లో సిబ్బంది ఫోన్ ఇంటర్‌నెట్ సాయంతో రైతు సేవల కోసం యంత్రాలు ఉపయోగించడం జరుగుతుందని ఏవో తెలియజేశారు.

నేర వార్తలు (crime news) ఆంధ్రజ్యోతి

విద్యుదాఘాతంతో పూరి గుడిసె దగ్ధం

- వృద్ధురాలి మృతి



ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ రాజేశ్వరరావు

కావలి రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): బట్లదిన్నెలో ఆదివారం అర్ధరాత్రి విద్యుదాఘాతంతో పూరి గుడిసె దగ్ధమైంది. ఈ ప్రమాదంలో గుడిసెలో నివాసం ఉన్న రాళ్లపల్లి నాగమ్మ (75) మరణించింది. రూరల్ పోలీసుల వివరాల మేరకు.. మృతురాలి భర్త 20ఏళ్ల కిందటే మృతి చెందాడు. వారికి నలుగురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కుమారుడు 4 ఏళ్ల కిందట పనుల నిమిత్తం దేశాలు పట్టుకుని వెళ్లాడు. అనారోగ్యంతో మంచం పట్టిన నాగమ్మను గ్రామంలోనే ఉండే పెద్దకుమార్తె కాకునూరు వెంకట సుబ్బమ్మ తన ఇంటి పక్కనే పూరిగుడిసెలో ఉంచి బాగోగులు చూస్తుంది. ఆదివారం రాత్రి వెంకట సుబ్బమ్మ అమ్మ నాగమ్మకు అన్నం పెట్టి గ్రామంలోనే ఉండే కుమార్తె ఇంటికి వెళ్లింది. అర్ధరాత్రి సమయంలో షార్టు సర్క్యూట్‌తో నాగమ్మ ఉండే పూరి గుడిసెకు మంటలు వ్యాపించాయి. స్థానికులు గుర్తించి మంటలు అదుపుచేశారు. అప్పటికే ఇంట్లో మంచంపై పడుకుని ఉన్న నాగమ్మపై తాటి ఆకులు పడటంతో వాటి వేడికి తట్టుకోలేక మృతి చెందించి. మృతురాలి కుమార్తె వెంకట సుబ్బమ్మ ఫిర్యాదుతో సీఐ రాజేశ్వరరావు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

వెంకటాచలం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : సర్వేపల్లి సమీపంలోని కృష్ణపట్నం పోర్టు రోడ్డుపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. నెల్లూరు మూలపేట ప్రాంతానికి చెందిన అశోక్, హరికృష్ణలు మోటర్ బైక్‌పై పొలానికి వెళ్లి తిరిగి వస్తుండగా ఈదగాలి రైల్వే గేటు మలుపు వద్ద ఇడిమేపల్లి నుండి సర్వేపల్లి వైపు వస్తున్న ఆటో వచ్చి బైక్‌ను ఢీకొంది. ప్రమాదంలో గాయపడిన వారిని చికిత్స నిమిత్తం సర్వేపల్లిలోని ప్రైవేటు క్లీనిక్‌కు తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రైలు కింద పడి ఇద్దరు యువకుల మృతి

నెల్లూరు(క్రైం), నవంబరు 25(ఆంధ్రజ్యోతి): నెల్లూరు నగరంలో సోమవారం రైలు కింద పడి ఇద్దరు యువకులు మృతి చెందారు. రైల్వే పోలీసుల సమాచారం మేరకు.. ఆత్మకూరు బస్టాండు నక్కలోళ్ల సెంటర్ సమీపంలో చెన్నై వైపు వెళ్లే రైలు పట్టాలపై సోమవారం ఉదయం 6 గంటల సమయంలో గుర్తుతెలియని యువకుడు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు 25 నుంచి 30 ఏళ్ల లోపు వయస్సు కలిగి నలుపురంగుపై తెలుపు చెక్స్ ఫుల్‌హ్యాండ్స్ షర్ట్, నలుపురంగు జీన్స్‌ప్యాంట్ ధరించి ఉన్నాడు. అదే ప్రాంతంలో 10 గంటల సమయంలో మరో యువకుడు(30) రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు నలుపురంగు ఫుల్‌హ్యాండ్స్ చొక్కా, గ్రేకలర్ ఫ్యాంటు ధరించి ఉన్నాడు. రెండు ఘటనలపై నెల్లూరు రైల్వే ఎస్ఐ జి మాలకొండయ్య కేసులు నమోదు చేశారు. మృతదేహాలను జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుల వివరాలు తెలిసిన వారు రైల్వే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

ఆటో నుంచి పడి మహిళ...

కావలి రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఉదయగిరి రోడ్డులోని దొంగలగుంట సమీపంలో సోమవారం బొగ్గవరపు సునీత, అలియాస్ కామాక్షమ్మ (36) ఆటోలో నుండి పడి మృతి చెందారు. రెండవ పట్టణ పోలీసుల వివరాల మేరకు మద్దూరుపాడు లోని టిడ్కో ఇళ్లలో నివాసముంటున్న సునీత కూలి పనుల నిమిత్తం జలదంకి వైపు ఆటోలో బయలుదేరింది. మార్గమధ్యలో అతివేగంగా ఆటో నడుపుతూ ఒక్కసారిగా బ్రేకు వేయడంతో ఆటోలో నుండి రోడ్డుపై పడింది. ప్రమాధంలో సునీత తలకు బలమైన రక్తగాయాలవడంతో ఏరియా వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలికి భర్త కోటేశ్వరరావు, ఇద్దరు పిల్లలున్నారు. ఎస్ఐ గోపిచంద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మోటారు సైకిల్ ఢీ కొని వ్యక్తికి గాయాలు

స్థానిక మార్కెట్ సెంటర్‌లో మోటారు సైకిల్ ఢీకొని కొణిదల సత్యనారాయణ గాయపడ్డారు. మార్కెట్ సెంటర్ వద్ద రోడ్డు దాటుతుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. సత్యనారాయణ ఫిర్యాదు మేరకు ఎస్ఐ సుమన్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

దాడి, దోపిడీ కేసులో నలుగురి అరెస్ట్

నెల్లూరు(క్రైం), నవంబరు 25(ఆంధ్రజ్యోతి): అసిస్టెంట్ ప్రొఫెసర్‌పై దాడి చేసి బంగారు నగలు దోచుకెళ్లిన కేసులో చిన్నబజారు పోలీసులు సోమవారం నలుగురు నిందితులను అరెస్ట్ చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. సంగం గ్రామానికి చెందిన శ్రీనివాస మోహన్ గూడూరులోని ఓ ప్రైవేట్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నాడు. ఆయన పిన్ని మూలాపేటలో నివాసం ఉంటున్నారు. ఈనెల 21వతేదీ శ్రీనివాస మోహన్ పిన్ని ఇంటికి నడుచుకుంటూ వెళుతుండగా రెండు బైక్‌ల్లో వచ్చిన ఆరుగురు గుర్తుతెలియని వ్యక్తులు అతనిపై దాడి చేసి ఆరు సవర్ల బంగారు గొలుసు, బ్రాసిలైట్లను దోచుకుని పరారయ్యారు. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన ఇన్‌స్పెక్టర్ సీహెచ్ కోటేశ్వరరావు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. సీసీ ఫుటేజ్‌లు, టెక్నాలజీ ఆధారంగా నగరంలోని పాత చెక్‌పోస్టు ప్రాంతానికి చెందిన షేక్ అబ్దుల్ అజీజ్, జాకీర్ హుసేన్ నగర్‌కు చెందిన షేక్ బబ్లూ, తడిక లబజార్ అరుంధతీవాడకు చెందిన మద్దాల సుదర్శనం అఖిల్, సంగం మండలం కోలగట్ల గ్రామానికి చెందిన కలిచేటి పెంచల రూపేష్‌ను నిందితులుగా గుర్తించి సోమవారం పాత చెక్‌పోస్టు వద్ద అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.2.50 లక్షల విలువ చేసే బంగారు చైన్, బ్రాస్లెట్లను స్వాధీనం చేసుకున్నారు.

భర్త, అత్తింటివారిపై కేసు నమోదు

నెల్లూరు(క్రైం), నవంబరు 25(ఆంధ్రజ్యోతి): అదనపు కట్నం కోసం భార్యను వేధించిన భర్త, అత్తిటివారిపై మహిళా పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. కోవూరుకు చెందిన స్పందనకు ఇందుకూరుపేటకు చెందిన చంద్రశేఖర్‌తో 2010లో వివాహమైంది. వివాహ సమయంలో ఆమె కుటుంబసభ్యులు రూ.3 లక్షలు, 30 సవర్ల బంగారు ఆభరణాలు, లక్ష విలువ చేసే గృహోపకరణాలు కట్నకానుకుల కింద చంద్రశేఖర్ కుటుంబసభ్యులకు ఇచ్చారు. కొంత కాలం వారి కాపురం సజావుగా సాగినా భర్త, అత్తింటి వారు అద నపు కట్నం రూ2 లక్షలు తీసుకురావాలని స్పందన ను వేధించడం ప్రారంభించారు. ఈ మేరకు బాధి తురాలు సోమవారం మహిళా పోలీసుల స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ టీవీ సుబ్బారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	92
లేయర్ లైవ్	110
స్కిన్ చికెన్	174
స్కిన్‌లెస్	194
లేయర్	187

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.7416
వెండి కిలో ధర	రూ. 91,800
వెండి ఒక గ్రాము	రూ.94.80

స్నేహితుడిపై దాడి

నెల్లూరు(క్రైం), నవంబరు 25(ఆంధ్రజ్యోతి): స్నేహితునిపై ముగ్గురు వ్యక్తులు దాడిచేసి గాయపరిచిన ఘటనపై వేదాయపాలెం పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. వైఎస్ఆర్ నగర్‌కు చెందిన సురేష్ బేల్దారి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. వ్యక్తిగత కారణాలతో ఆయన ఒంటరిగా జీవిస్తుండగా ఆదే ప్రాంతానికి చెందిన సంతోష్ మరో ఇద్దరు అతనికి పరిచయం అయ్యారు. అందరూ స్నేహంగా ఉంటూ తరచూ సురేష్ ఇంట్లో మద్యం సేవిస్తుండే వారు. ఇటీవల వారి మధ్య మనస్పర్థలు చోటుచేసుకోవడంతో సంతోష్, మరో ఇద్దరు ఈనెల 22వ తేది రాత్రి సురేష్ ఇంట్లో చొరబడి అతనిపై దాడిచేసి గాయపరిచారు. ఈ మేరకు బాధితుడు సోమవారం వేదాయపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

డయాలసిస్ రోగులకు

● సకాలంలో వైద్యశాలకు వెళ్లలేక బాధితుల అవస్థలు

108 సేవలు కరువు



ఉదయగిరి రూరల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): కిడ్నీల్లో సమస్యలు తలెత్తి డయాలసిస్ చేయించుకుంటున్న బాధితులకు కష్టాలు రెట్టింపవుతున్నాయి. గతంలో డయాలసిస్ కేంద్రాలకు 108 వాహనాల్లో వెళ్లేవారు. సుమారు నెల రోజుల నుంచి అంబులెన్స్ సేవలు నిలిపివేశారు. దీంతో ఎన్నో వ్యయప్రయాసాలు ఎదుర్కొని కేంద్రాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. గతంలో 108 కాల్‌సెంటర్‌కు ఫోన్ చేసి వివరాలు తెలిపితే అంబులెన్స్ పంపేవారు. బాధితులను ఎక్కించుకొని కేంద్రాల వద్ద వదిలేవారు. డయాలసిస్ అనంతరం బాధితులు ప్రైవేటు వాహనాల్లో ఇళ్లకు వెళ్లిపోయేవారు. అయితే గత కొన్నిరోజులుగా 108 వాహనం రావడంలేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉదయగిరి ప్రాంతంలో సుమారు 50 మంది డయాలసిస్ రోగులు ఉన్నారు. ప్రస్తుతం అంబులెన్స్ రాకపోవడంతో సకాలంలో వైద్యశాలకు చేరుకోలేకపోవడంతో ఆర్థికంగా నష్టపోతున్నామని వాపోతున్నారు.

అత్యవసర సేవల కోసం..

ఈ విషయమై పలువురు పైలెట్లు, ఈఎంటీలను అడగ్గా డయాలసిస్ రోగులను తీసుకెళుతుండడంతో అత్యవసర కేసులకు వెళ్లలేకపోతున్నామని, దీంతో సంస్థ డయాలసిస్ రోగులకు 108 అంబులెన్స్ సేవలను నిలిపివేసిందని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి డయాలసిస్ రోగులకు 108 అంబులెన్స్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చి ఆదుకోవాలని పలువురు బాధితులు కోరుతున్నారు.

పింఛన్ డబ్బులు చార్జీలకే..

కిడ్నీ సమస్యలతో బాధపడుతున్న పలువురు రోగులు డయాలసిస్ కోసం ఆత్మకూరు జిల్లా వైద్యశాలకు వెళుతుంటారు. ఉదయగిరి మండలంలోని ఉదయగిరి, మల్లారెడ్డిపల్లి, అప్పసముద్రం, తిరుమలాపురం, శకునాలపల్లి గ్రామాలతోపాటు సీతారామపురం, దుత్తలూరు, వరికుంటపాడు తదితర మండలాల్లో రోగులు వారానికి రెండు, మూడుసార్లు డయాలసిస్ చేయించుకోవాల్సి వస్తుంది. అయితే గతంలో మాదిరిగా అంబులెన్స్ సౌకర్యం లేకపోవడంతో రోగితోపాటు మరో వ్యక్తి తోడు వెళ్లాల్సి ఉండడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని బాధితులు వాపోతున్నారు. ప్రభుత్వం ఇచ్చే రూ.10 వేలు పింఛను నగదు మందులు, చార్జీలకు సరిపోగా మరో రూ.10 వేలు అదనంగా ఖర్చు పెడుతున్నామని బాధితులు చెబుతున్నారు.

అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించాలి

● ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ ఆనంద్



అర్జీదారుల సమస్యను వింటున్న కలెక్టర్ ఆనంద్

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని కలెక్టర్ ఆనంద్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ తిక్కన భవన్‌లో జరిగిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో జిల్లా నలుమూల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో భూముల సర్వే, రెవెన్యూ అంశాలకు సంబంధించి అర్జీలు ఎక్కువ శాతం వస్తున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో వచ్చిన 280 అర్జీలను నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

అల్పపీడనం ప్రభావం నేపథ్యంలో జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆనంద్ సూచించారు. ఎలాంటి సహాయక చర్యలు చేపట్టాల్సిన పరిస్థితి వచ్చినా ప్రణాళికలతో సిద్ధంగా ఉండాలన్నారు. అత్యవసర సహాయం కోసం కలెక్టరేట్‌లో 0861-2331261 టోల్ ఫ్రీ నెంబరు ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో ఉదయభాస్కర్, జడ్పీ సీఈవో విద్యారమ, డీపీవో శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీసీ కులగణన చేపట్టాలి

బీసీ కులగణన చేపట్టాలని పలు సంఘాల నాయకులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పనమాల శ్రీహరిరావు మాట్లాడుతూ వెంటనే కులగణన చేపట్టి ఆంధ్రప్రదేశ్‌లో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు పోవాలన్నారు. కులం ఆధారంగా సీట్లు కేటాయించాలన్నారు. అలాగే నెల్లూరు జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు ఖాజన వెంకట శేషయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో 20 లక్షల జనాభా కలిగిన విశ్వబ్రాహ్మణ సామాజిక వర్గాన్ని ప్రభుత్వం గుర్తించి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్నారు. దేవాలయాల్లో నామినేటెడ్ పోస్టులు ఇవ్వాలన్నారు. ఎమ్మెల్సీ సీటు కల్పిస్తామని అన్ని పార్టీలు చెపుతున్నా ఇంత వరకు అమలు చేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో చిలకపాటి మాల్యాద్రి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీసీ సంక్షేమ, విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు

వితంతువులకు న్యాయం చేయాలి

విడవలూరు మండలం ఊటుకూరు గ్రామానికి చెందిన సీతారావమ్మ, సులోచన అనే వితంతు మహిళలు నిర్మించుకుంటున్న ఇంటి ప్రహరీగోడను అడ్డుకుంటున్న వారిపై చర్యలు తీసుకుని సమస్య పరిష్కరించాలని కోరుతూ బీజేపీ నాయకులు మిడతల రమేష్, కందికట్ల రాజేశ్వరిలు కలెక్టర్ ఆనంద్‌కు బాధిత మహిళలతో కలిసి వినతి పత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ వితంతువులైన ఆ మహిళలు 60 ఏళ్ల క్రితం నిర్మించిన వారి ఇంటి ప్రహరీ గోడ కూలిపోతే తిరిగి నిర్మించుకుంటుండగా ఆ ప్రాంతానికి చెందిన ముస్లింలు అడ్డుకుంటున్నారని ఆరోపించారు. వారి ఇళ్ల వెనుక శవాలను పూడ్చటం వంటి పనులు చేస్తున్నారన్నారు. ఆ ప్రాంతంలో 11 ముస్లిం కుటుంబాలకు ఒకటిన్నర ఎకరా శ్మశాన స్థలం ఉందని, ఉద్దేశ్యపూర్వకంగా ఆ మహిళల ఇళ్లను ఖాళీ చేయించి ఆక్రమించుకోవాలని చూస్తున్నారన్నారు. స్పందించిన కలెక్టర్ తహసీల్దారుకు ఫోన్ చేసి 24 గంటల్లో హద్దులు ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో విడవలూరు మండల బీజేపీ అధ్యక్షుడు నాగేంద్ర, జిల్లా కార్యదర్శి చిలకా ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

తుఫాన్‌పై అప్రమత్తంగా ఉండండి

సెలవులు రద్దు : ఎస్ఈ విజయన్

నెల్లూరు(జడ్పీ), నవంబరు 25(ఆంధ్రజ్యోతి): రానున్న మూడు, నాలుగు రోజుల్లో జిల్లాకు తుఫాన్ ముప్పు ఉన్నందున విద్యుత్ అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ శాఖ ఎస్ఈ విజయన్ ఆదేశించారు. సోమవారం ఆయన కార్యాలయం నుంచి జిల్లాలోని అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉద్యోగులకు సెలవులన్నీ రద్దు చేశామని, ప్రతి ఒక్కరూ విధుల్లో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జిల్లాకు తుఫాన్ ముప్పు ప్రమాదం ఉందని వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేసిందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని అధికారులంతా పూర్తి అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజలను సైతం అప్రమత్తం చేసి విద్యుత్తు ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వర్షాలు తగ్గేవరకు ప్రతి సబ్‌స్టేషన్‌లో ఇద్దరు సిబ్బందిని మాత్రమే ఉంచి, మిగిలిన వారందరినీ అత్యవసర సేవలకు వినియోగించుకోవాలన్నారు.

ఏఆర్ డీఎస్పీ చంద్రమోహన్ బాధ్యతల స్వీకరణ



నెల్లూరు(క్రైం), నవంబరు 25(ఆంధ్రజ్యోతి): నెల్లూరు ఏఆర్ డీఎస్పీగా ఎస్ చంద్రమోహన్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాలులో ఎస్పీ కృష్ణకాంత్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. విడవలూరుకు చెందిన చంద్రమోహన్ 1992లో ఆర్ఎస్ఐగా పోలీసు శాఖలో బాధ్యతలు చేపట్టారు. పదోన్నతులు పొందుతూ ఇటీవల జరిగిన బదిలీల్లో ఏఆర్ డీఎస్పీగా నియమతులయ్యారు.

ప్రజా వ్యతిరేక విధానాలు విడనాడండి

● నెల్లూరు నగరంలో సీఐటీయూ స్కూటర్ ర్యాలీ



స్కూటర్ ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

నెల్లూరు(వైద్యం), నవంబరు 25(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను విడనాడాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం నగరంలో శెట్టిగుంట రోడ్డు నుంచి ఆత్మకూరు బస్టాండ్, మినీబైపాస్, ముత్తుకూరు గేటు, వీఆర్‌సీ, ట్రంకురోడ్ మీదుగా ఏబీఎం కాంపౌండ్ వరకు స్కూటర్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అజయ్‌కుమార్ మాట్లాడుతూ రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. ఏ రంగంలో పనిచేసే కార్మికుడికైనా కనీస వేతనం రూ. 26వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ నగర కార్యదర్శి నాగేశ్వరరావు మాట్లాడుతూ పరిశ్రమలలో పనిచేసే కార్మికులకు వేతన భద్రత కల్పించాలని, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు కత్తి శ్రీనివాసులు, మూలం ప్రసాద్, ఆర్ శ్రీనివాసులు, రాంబాబు, అశోక్, షేక్ మస్తాన్‌బీ, సూర్యనారాయణ, అంకయ్య, చెంచులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ యోగాలో జిల్లా క్రీడాకారుల ప్రతిభ

నెల్లూరు(విద్య), నవంబరు 25(ఆంధ్రజ్యోతి): తమిళనాడు రాష్ట్రం చెన్నైలోని స్పోర్ట్స్ యూనివర్శిటీలో ఈనెల 24వ తేదీన జరిగిన జాతీయ యోగా పోటీల్లో జిల్లాకు చెందిన యోగా క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారు. అండర్-12-14 విభాగంలో శ్రీకీర్తి తృతీయస్థానం, అండర్-36-45 విభాగంలో జి.రేవతి ద్వితీయస్థానం, అండర్-46-55 విభాగంలో ఎంవీ.ప్రసన్నకుమార్ ప్రథమస్థానం, 56 ఏళ్ల పైబడిన విభాగంలో బి.రఘురామయ్య ద్వితీయస్థానం సాధించారు. వారిని గురువు ప్రసన్నకుమార్, క్రీడాకారులు అభినందించారు.



పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులు

బాధితులకు చట్టపరంగా

న్యాయం చేస్తాం : ఎస్పీ



ఫిర్యాదులతో మాట్లాడుతున్న ఎస్పీ కృష్ణకాంత్

నెల్లూరు(క్రైం), నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చిన ఫిర్యాదులపై విచారణ జరిపి చట్టపరంగా న్యాయం చేస్తామని ఎస్పీ జీ కృష్ణకాంత్ తెలిపారు. నగరంలోని ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌లో ఎస్పీ ఫిర్యాదులు స్వీకరించి మాట్లాడుతూ ఈ ఫిర్యాదులను నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని పోలీసు అధికా రులను ఆదేశించారు.

- ఓ బ్యాంక్‌లో పీవో ఉద్యోగం ఇప్పిస్తానని వేదాయపాలెంకు చెందిన బెనర్జీ అనే వ్యక్తి నమ్మించి రూ.25లక్షల తీసుకొని కాలయాపన చేశాడని, దీంతో మోసపోయానిని భావించి తన నగదు ఇచ్చేయాలని కోరగా ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నాడని వేదాయపాలెం ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి ఎస్పీని కోరారు.
- బెంగళూరుకు చెందిన రూప్‌కుమార్‌కు పొలం వివాదంలో 5 ఏళ్ల జైలు శిక్ష విధించగా ఆ కేసు రాజీ చేసుకోవాలని టీపీ గూడూరుకు చెందిన రూప్‌కుమార్, అతని అనుచరులు బెదిరిస్తున్నారంటూ బాధితుడు ఎస్పీని కలిశారు.
- తన కుమారులు ఉదయ్‌కిరణ్, సుబ్రహ్మణ్యం ఆస్తి కోసం వేధిస్తూ ఇంటి నుంచి గెంటేశారని, న్యాయం చేయాలని మనుబోలుకు చెందిన ఓ వృదుడు ఫిర్యాదు చేశారు.
- తన రెండవ కుమారుడు ఉరేసుకొని మరణించాడని, దీనిపై పలు అనుమానాలు ఉన్నాయని, విచారణ జరిపించి న్యాయం చేయాలని నవాబుపేటకు చెందిన మృతుడు తల్లి ఎస్పీని కోరారు.
- వేదాయపాలెం పరిధికి చెందిన మహిళను తన బావ ఇస్మాయల్ ఫోన్‌లో బెదిరిస్తూ, వేధిస్తున్నారని, అతని వల్ల నా కుటుంబంలో వివాదాలు వస్తున్నాయని వెంటనే న్యాయం చేయాలని బాధితురాలు కోరింది. వీటన్నింటిపై విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని అధికారులను ఎస్పీ ఆదేశించారు.

సోమశిలకు 4,361 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

అనంతసాగరం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ నుంచి సోమవారం 4,361 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. డ్యాం పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలుకాగా ప్రస్తుతం 70.650 టీఎంసీల నిల్వ ఉందని, డెల్టాకు 1,050, కండలేరుకు 2100, ఉత్తర కాలువకు 700, దక్షిణ కాలువకు 400 క్యూసెక్కులు విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

ఎన్నాళ్లీ నీటి వృథా.. ?



అయ్యవారిపల్లె- మాలకొండ గ్రామాల మధ్య ఉన్న జాతీయ రహదారి సమీపంలోని చుండి చెర్లోపాలెం రక్షిత మంచినీటి పథకం తాగునీటి పైప్‌లైన్ లీకేజీతో నీరు వృథాగా పోతోంది. అధికారులు దీనికి వాల్వ్ ఏర్పాటు చేయకపోవడంతో నీరు ఐదారు అడుగులు ఉవ్వెత్తున ఎగిసి పడుతుంది. ఈ సమస్యతో ఈ మంచినీటి పథకం పరిధిలోని గ్రామాలకు పూర్తిస్థాయిలో నీరు అందడం లేదు.

- వలేటివారిపాలెం, (ఆంధ్రజ్యోతి)

సబ్ రిజిస్ట్రార్ బాధ్యతల స్వీకరణ

ఉదయగిరి రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌గా పల్లపు మెల్కిరోషన్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. నెల్లూరు రిజిస్ట్రార్ కార్యాలయ ఆడిట్ విభాగంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న మెల్కిరోషన్‌ను ఇక్కడికి బదిలీ చేయడంతో ఆయన బాధ్యతలు స్వీకరించారు.

అధికారుల గైర్హాజరు

వలేటివారిపాలెం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కారం కోసం ప్రతివారం చేపట్టనున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి అధికారులు గైర్హాజరయ్యారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమానికి తహసీల్దార్, ఎంపీడీఓ మాత్రమే హాజరై మిగిలిన శాఖల అధికారులు గైర్హాజరయ్యారు. నాలుగునెలలుగా ఈ కార్యక్రమానికి ఒకరిద్దరూ మాత్రమే వస్తున్నా సంబంధిత ఉన్నతాధికారులు పట్టించుకోడంలేదు. అధికారులు లేకపోవడంతో ఫిర్యాదు చేయడానికి వచ్చిన ప్రజలు ఉసూరుమంటూ వెనుదిరిగి వెళ్లారు. కేవలం మూడు అర్జీలు మాత్రమే వచ్చినట్లు తహసీల్దార్ అబ్దుల్‌అమీర్ తెలిపారు.

ఇదా పీహెచ్‌సీ..?

- శిథిలావస్థలో గట్టుపల్లి ఆరోగ్య కేంద్రం
- బిక్కుమంటూ సిబ్బంది విధుల నిర్వహణ

జలదంకి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): గట్టుపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం అంటే గతంలో ఎంతో ఘనకీర్తిగా ఉండేది. నేడు ఈ పీహెచ్‌సికి వెళ్తే ఇదేమి పీహెచ్‌సీ అని అందులోకి వెళ్లిన వారు నోరెళ్ల బెడుతున్నారు. చుట్టుపక్కల 15గ్రామాలకు చెందిన వైద్యసేవలందించే ఆస్పత్రి భవనం ఇలా శిథిలావస్థకు చేరిఉన్నా అధికారులు పట్టించుకోక పోవడం విచారకరం అని వైద్య సేవలకు వెళ్లిన రోగులే చర్చించుకుంటున్నారు. ఇక విధులు నిర్వహించే వైద్యులు, సిబ్బంది పరిస్థితి ఎలా ఉంటుందో ఒకసారి ఊహించుకోండి. వర్షం కురిస్తే భవనమంతా ఉరుస్తుంది. ఈ సమయంలో వైద్యపరికరాలు తడవకుండా ఉండేందుకు ఫ్లెక్సీలను సిబ్బంది అడ్డం కట్టుకుని కాలం వెల్లదీస్తున్నారు. రోగులకు కోసం ఏర్పాటు చేసిన మంచాలపై శ్లాబు పెచ్చెలూడి పడి భయానకంగా ఉంది.



రోగులకు ఏర్పాటు చేసిన మంచాలపై పడిన శ్లాబు పెచ్చులు



భవనం శ్లాబు పెచ్చులూడి బయటపడ్డ ఇనుపచువ్వలు



వానొస్తే పరికరాలు తడవకుండా ఫ్లెక్సీ అడ్డుగా ఏర్పాటు

ఆకస్మిక తనిఖీలు

ఉలవపాడు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఎరువులు, పురుగు మందుల దుకాణాలపై సోమవారం వ్యవసాయ శాఖ ఇంటర్నల్ స్క్వాడ్ ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. వీరి వెంట కావలి సహాయ వ్యవసాయ సంచాలకులు సీహెచ్ నాగరాజు, మండల వ్యవసాయ అధికారిణి తిరుమల జ్యోతి ఉన్నారు.

పొగాకు సాగుచేయొద్దు

లింగసముద్రం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పొగాకు రైతులు ఈ ఏడాది అధిక విస్తీర్ణంలో పంట సాగు చేయద్దని కందుకూరు పొగాకు బోర్డు 27వ వేలం కేంద్రం నిర్వహణ అధికారి చంద్రశేఖర్ తెలిపారు. మొగిలిచెర్లలో పొగాకు సాగు నియంత్రణపై రైతులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ గ్రేడింగ్ అధికారి రాజగోపాలరెడ్డి, ఐటిసి ప్రతినిధి రాజశేఖర్, జీపీఐ కంపెనీ ప్రతినిధి ఉన్నం శ్రీనివాసులు పాల్గొన్నారు.

మాన్యం భూములు కాపాడాలి

వింజమూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండల పీర్ల మాన్యం భూములను కాపాడాలని తహసీల్దారు హమీద్‌కి ముస్లింలు వినతిపత్రం అందజేశారు. ఈ భూములను కొంతమంది వ్యక్తులు అక్రమంగా అమ్మకానికి ప్రయత్నాలు చేస్తున్నారని సోమవారం వారు నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కన్వీనర్ భాస్కర్‌రెడ్డి, పీర్ల మాన్యం మత పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరికి తీవ్ర గాయాలు

సీతారామపురం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): చిన్ననాగంపల్లి వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బెడుసుపల్లి బసిరెడ్డి రమణారెడ్డి, బసిరెడ్డి పద్మావతి దంపతులు తీవ్రంగా గాయపడ్డారు. వీరు బైక్‌పైన బైరవకోన నుంచి సొంత గ్రామానికి వస్తుండగా కారు వెనుక నుంచి బైక్‌ను ఢీకొట్టినట్లు తెలిపారు. స్థానికులు 108కి సమాచారమివ్వగా క్షతగాత్రులను 108 వాహనంలో స్థానిక పిహెచ్‌కి తరలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఉదయగిరికి తరలించారు.

భగవద్గీత శ్లోక కంఠస్థ పోటీలు

ఆత్మకూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కరటంపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు భగవద్గీత శ్లోక కంఠస్థ పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. న్యాయ నిర్ణేతలుగా రామయ్యస్వామి, నాగరాజస్వామి వ్యవహరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పెంచలరెడ్డి, తెలుగు టీచర్ రజనీప్రియ, సత్యవతి, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

కలువాయి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం ప్రభావంతో మంగళవారం నుంచి మూడురోజుల పాటు భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నందున రైతులు అంతా అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయాధికారి ప్రతాప్ కోరారు. వరి సాగు, నాట్లు వేసేవారు వర్షాల అనంతరం వేసుకోవాలని సూచించారు.

ఉపాధ్యాయుడికి అవార్డు

సంగం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి):గాంధీజన సంఘం ఉన్నత పాఠశాల తెలుగు పండిట్, తెలుగు భారతి సేవా సమితి ప్రధాన కార్యదర్శి వెంకట్‌రెడ్డి హైదరాబాదులో సోమవారం ఏపీజే అబ్దుల్ కలాం లెజెండరీ అవార్డు అందుకున్నారు.

ధర్నాను విజయవంతం చేయాలి

ఉదయగిరి రూరల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): తహసీల్దారు కార్యాలయం ఎదుట మంగళవారం నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని జిల్లా రైతు సంఘం నాయకులు కాకు వెంకటయ్య సోమవారం పట్టణంలో కరపత్రాలు పంపిణీ చేశారు.

కావలి పట్టణాభివృద్ధిపై ఎమ్మెల్యే సమీక్ష

కావలి టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ శ్రావణ్‌కుమార్‌తో కలిసి ఎమ్మెల్యే దగుమాటి కృష్ణారెడ్డి సోమవారం పట్టణాభివృద్ధిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. పట్టణంలోని 40వార్డుల ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాల కల్పన, 9కిమీలో మీటర్ల పరిధిలోని ట్రంకురోడ్డు అభివృద్ధి, ప్రతి ఇంటికి తాగునీటి కులాయి తదితర అభివృద్ధి సంక్షేమ పనులపై ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. గతపాలకుల నిర్లక్షంతో రూ.52కోట్ల (పైలెట్ ప్రాజెక్ట్) అమృత్ పథకానికి అధోగతి పట్టించారన్నారు. ట్రంకురోడ్డు విస్తరణ పేరుతో రూ.7కోట్ల విలువైన పైపులైన్లు ధ్వంసం చేసారని వాటి రికవరీకి చర్యలు తీసుకోవాలని ఆదేశించామన్నారు. ఇళ్లులేని పేదలకు 2సెంట్లు స్థలం కేటాయిస్తామని, స్థలం ఉన్న లబ్ధిదారులకు గృహాలు మంజూరు చేస్తామని 30లోపు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. సమావేశంలో గుత్తికొండ కిషోర్, మలిశెట్టి వెంకటేశ్వర్లు, రాజ్‌కుమార్ చౌదరి పాల్గొన్నారు.

ప్రజాసేవకు ఎల్లప్పుడూ ముందుంటాం...

- ఎంపీపీ తాళ్లూరు వెంకటకృష్ణప్రసాద్ నాయుడు

దగదర్తి, (బిట్రగుంట) నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు సేవలు చేసే విషయంలో తాళ్లూరు కుటుంబసభ్యులు ముందుంటారని ఎంపీపీ తాళ్లూరు వెంకటకృష్ణప్రసాద్ నాయుడు తెలిపారు. మండలంలోని చెన్నూరు, బోడగుడిపాడు గ్రామాల్లో తాళ్లూరు రమణయ్యనాయుడు సుజాతమ్మల జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన ఉచిత మినిరల్ వాటర్ ప్లాంట్లను సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో తాళ్లూరు రమణయ్యనాయుడు మనుమరాళ్ళు, మనుమలు డీ.చరణ్, అలేఖ్య బీ.సుమంత్, అశ్రీత, టీ.వెంకటసాయి, శివాణి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెంకటకృష్ణప్రసాద్ నాయుడు

ముఖ్యమంత్రితో మాలేపాటి సోదరులు

దగదర్తి, (బిట్రగుంట) నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): దగదర్తి మండలానికి చెందిన టీడీపీ ఉపాధ్యక్షులు మాలేపాటి సుబ్బానాయుడు, మాజీ ఇరిగేషన్ బోర్డు డైరెక్టర్ మాలేపాటి రవీంద్రనాయుడు సోమవారం అమరావతిలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఎం వారితో మాట్లాడారు. పార్టీ సభ్యత్వ నమోదు వేగవంతం చేయాలని పార్టీ కోసం కష్టపడి పనిచేయాలన్నారు. వారి వెంట టీడీపీ యువనేత మాలేపాటి భానుచంద్రర్ నాయుడు, కంచర్ల కృష్ణ తదితరులు ఉన్నారు.



సీఎం చంద్రబాబునాయుడుతో మాలేపాటి సోదరులు

మోసపోయాం... ఆదుకోండి

- తహసీల్దారుకు బాధితుల మొర



తహసీల్దారుకు ఫిర్యాదు చేస్తున్న కోటితీర్థం ఎస్సీ కాలనీ వాసులు

చేజర్ల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో తాము సాగు చేస్తున్న భూమికి పట్టాలు ఇప్పిస్తామని చెప్పి తమ వద్ద నగదు వసూలు చేసి నకిలీ పాసు పుస్తకాలు ముట్టచెప్పి తమను మోసం చేశారని, ఆదుకోవాలని కోటితీర్థం ఎస్సీలు సోమవారం ప్రజా విజ్ఞప్తుల కార్యక్రమంలో తహసీల్దారుకు మొర పెట్టుకున్నారు. పూర్తి వివరాల మేరకు... చేజర్ల మండలం కోటితీర్థం గ్రామానికి చెందిన కొంత మంది ఎస్సీలు కొంతకాలంగా భూమిని సాగు చేస్తున్న నేపథ్యంలో భూ పంపిణీలో పట్టాలు ఇప్పిస్తామని సదరు గ్రామానికి చెందిన కాకి పెంచలయ్య నమ్మబలికి తమ వద్ద నగదు వసూలు చేసినట్లు వారు తెలిపారు. అనంతరం తమకు పాసుపుస్తకాలు అందజేసిట్లు, అయితే ఇటీవల ఆ పాసు పుస్తకాలను పెట్టి బ్యాంకులో లోనుకు సంప్రదించగా అవి నకిలీవని తేలిందన్నారు. వెంటనే తమను మోసం చేసిన కాకి పెంచలయ్యను నిలదీయగా మీకు దిక్కున్న చోట చెప్పుకోండి అంటూ సమాధానం ఇచ్చినట్లు వారు ఆవేదన వ్యక్తం చేశారు. చివరకు గత్యంతరం లేక సోమవారం చేజర్ల తహసీల్దారుకు తమ వద్ద ఉన్న ఆధారాలతో అర్జీ అందచేసినట్లు వారు తెలిపారు. దీనిపై చేజర్ల తహసీల్దారు ఆర్ మస్తానయ్యను వివరణ కోరగా విచారించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మట్టి తొలగింపు

కావలి రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక వైకుంఠపురం అన్నపుగుంట బజారులోని సీసీరోడ్డుపై వైసీపీ నేతలు వేయించిన గ్రావెల్‌ను సోమవారం మున్సిపల్ సిబ్బంది తొలగించారు. చిన్నపాటి వర్షాలు కురిసినా అన్నపుగుంట బజారు వర్షపు నీటితో నిండి ఇళ్లలోకి నీరు పోతుండటంతో అధికారులు ఈ చర్యలు తీసుకున్నారు. ఎమ్మెల్యే ఆదేశాలతో పనులు చేపట్టామని అధికారులు తెలిపారు.

వెటర్నరీ కాలేజీకి ప్రతిపాదనలు

కొండాపురం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): వెటర్నరీ కళాశాల ఏర్పాటుకు ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించడంపై టీడీపీ మండల కన్వీనర్ మామిళ్లపల్లి ఓంకార్, మాజీ వైస్ చైర్మెన్ పోలినేని చంద్రబాబు నాయుడులు హర్షం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలోని చింతలదేవిలో కళాశాలకు అనువైన ప్రదేశం ఉందన్నారు. కార్యక్రమంలో టీడీపీ రైతు కార్యదర్శి పోలినేని రమేష్, తెలుగు యువత అధ్యక్షుడు దాసరి అశోక్, చైతన్య పాల్గొన్నారు.

7న మెగా పేరెంట్స్‌డే

కందుకూరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): విద్యాశాఖ ఆధ్వర్యంలో అన్ని మండలాల్లో వచ్చే నెల 7న మెగా పేరెంట్స్ డే నిర్వహిస్తున్నట్లు కందుకూరు ఉప విద్యాశాఖాధికారి జానకీరామ్ తెలిపారు. సోమవారం ఆయన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావును మర్యాదపూర్వకంగా కలిసి డే నిర్వహణకు జరుగుతున్న ఏర్పాట్లను వివరించారు.

పెట్రోలు బంకు నిర్మాణం తగదు

- సబ్ కలెక్టరుకు వినతి

కందుకూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండల కార్యాలయాల ఆవరణలో పెట్రోలు బంకు ఏర్పాటుకు అనుమతి ఇవ్వటం శోచనీయమని తక్షణం ఆ ఉత్తర్వులను రద్దు చేయాలని నియోజకవర్గ అభివృద్ధి మండలి ప్రతినిధులు కోరారు. ఈ విషయంపై సోమవారం సబ్ కలెక్టరు శ్రీపూజకు వినతిపత్రం ఇచ్చారు.

మాదక ద్రవ్యాలపై అవగాహన

ఉలవపాడు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : యువతను పెడదారి పట్టించే గంజాయి, మాదక ద్రవ్యాలపై స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు ఎస్సై అంకమ్మ సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సేల్‌ఫోన్స్ వాడకం పెరిగిపోవడంతో చెడు వ్యసనాల వైపు దృష్టి సారించొద్దన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ మోసపూరిత కుట్ర

- అంబేడ్కర్ యవజనసంఘం రాష్ట్ర అధ్యక్షుడు సాల్మన్‌రాజు

అల్లూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ రాజకీయ నాయకులు చేపట్టే ఒక మోసపూరిత కుట్ర అని అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్లు సాల్మన్‌రాజు ఆ రోపించారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా సోమవారం స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట నిరసన సంఘం సభ్యులతో కలిసి ఆందోళన చేపట్టి మాట్లాడారు. దళితులంతా ఒక్కటే అని మాల, మాదిగలు కలసి మెలసి ఉన్నామని ఇరువులను విడదీసి మాలలకు అన్యాయం చేసేందుకే ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టారని మండిపడ్డారు. కార్యక్రమంలో అరగల రమణయ్య, శ్రీనివాసులు, పంగులూరు సుధాకర్, నరేంద్ర, గంగపట్నం సతీష్, వెంకటేష్, ప్రణయ్ పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న దళితులు

జగనన్న లే అవుట్ పనులపై విజిలెన్స్ తనిఖీలు

కొండాపురం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో సాయిపేట స్థానిక చెరువు సమీపంలో ఏర్పాటు చేసిన జగనన్న లే అవుట్ల పనులపై సోమవారం విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. తుది బిల్లు మంజూరుకు కాంట్రాక్టరు కోర్టును ఆశ్రయించగా కోర్టు ఆదేశాలతో పనులను పరిశీలించేందుకు వచ్చినట్లు డ్వామా సీనియర్ క్వాలిటీ కంట్రోల్ అధికారి వాసిలి సురేష్‌బాబు తెలిపారు. అనంతరం వెలిగండ్ల, గరిమెనపెంట గ్రామాలలో జరిగిన పనులను పరిశీలించారు. పరిశీలనల నివేదికను డ్వామా ఉన్నతాధికారులకు అం దజేస్తామన్నారు. కార్యక్రమంలో జూనియర్ క్వాలిటీ కంట్రోల్ అధికారులు ఖలీలుల్లా, కిషోర్‌బాబు ఉన్నారు.



పనులను పరిశీలిస్తున్న అధికారులు

యాదవ కార్పొరేషన్ డైరెక్టర్‌కి సన్మానం



నాగరాజును సన్మానిస్తున్న నాయకులు

గుడ్లూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ జనిగర్ల నాగరాజును స్థానిక విద్యావనరుల కార్యాలయంలో మండల యూటీఎఫ్ నాయకులు మక్కెన రమేష్, మనోహర్‌లు శాలువా పూలమాలలతో సన్మానించారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి నాగరాజు పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈవో గోవర్ధన్, ఉపాధ్యాయులు జొన్నల గడ్డ వెంకటాద్రి, గొర్రెపాటి మధుసూధన్ రావు, తిరపతిస్వామి, వెంకటేశ్వరు ఉన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు విరాళం

కందుకూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో సీసీ కెమెరాలు ఏర్పాటుకు ప్రైవేటు హాస్పటల్స్ వైద్యులు రూ.3.8లక్షలు విరాళాలను సేకరించారు. ఈ మొత్తాన్ని సోమవారం వారు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావును కలిసి అందజేశారు. పట్టణంలో భద్రతను పెంపొందించటం కోసం తమవంతు సహకారం అందినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగేశ్వరరావు వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సీఐ వెంకటేశ్వరరావు ఉన్నారు.



ఎమ్మెల్యేకు విరాళం ఇస్తున్న ప్రైవేటు ఆస్పత్రుల వైద్యులు

బాల్య వివాహాల నిర్మూలన చట్టాలపై అవగాహన

కావలిటౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక వెంగళరావునగర్ 18వ వార్డులో సోమవారం బాల్య వివాహాల నిర్మూలన చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఐసీడీఎస్ సీడీపీవో సౌజన్య, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ బ్రిజిత, ఎంఈవో గోవిందయ్యలు పాల్గొని చట్టాలపై అవగాహన కల్పించారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు సమాచారముంటే వెంటనే ఐసీడీఎస్ అధికారులకు తెలపాలని పిల్లల తల్లితండ్రులతో కలిసి వాటి అనర్థాల గురించి వివరించి వివాహాలు వాయిదా వేయించాలన్నారు. బాల్య వివాహాల నిర్మూలనపై ప్రతిజ్ఞ చేసి ర్యాలీ నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక చివరి సోమవార పూజలు

ఆత్మకూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం చివరి సోమవారం సందర్భంగా ఆత్మకూరులోని శైవాలయాలు భక్తుల శివనామ స్మరణతో మారుమోగాయి. భక్తులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణ శివాలయంలో, వెంకటేశ్వరస్వామి ఆలయం, అభయాంజనేయస్వామి, కన్యకాపరమేశ్వరి ఆలయం, అలఘ నాథస్వామి ఆలయాల్లో కార్తీక పూజలు నిర్వహించారు. అలాగే షిర్డీ సాయిబాబా మందిరంలో సోమవారం సాయంత్రం ఇస్కాన్ నెల్లూరు హరేకృష్ణ మందిరం ఆధ్వర్యంలో శ్రీకృష్ణ రాధా ప్రతిమలు ఆవిష్కరించి దీపోత్సవ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు.

- సంగం: స్థానిక సంగమేశ్వరాలయంలో మహిళలు ఉదయం పెన్నమ్మకు పూజలు చేసి సంగమేశ్వరాలయంలో కార్తీక దీపాలు వెలిగించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే తిరుమనకొండలో శ్రీ రాజరాజేశ్వరిదేవి సమేత కాశీ విశ్వేశ్వర స్వామి జ్ఞానపీఠంలో పీఠాధిపతి రాజరాజేశ్వరానందస్వామి ఆధ్వర్యంలో అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. నెల్లూరు ఆర్టీసీ రీజనల్ జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి దంపతులు జ్ఞానపీఠం సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.
- అనంతసాగరం: చిలకలమర్రి అటవీ ప్రాంతం మల్లెంకొండేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేశారు. కామిరెడ్డిపాడు ఉన్నత విద్యార్థులు వనభోజనలో పాల్గొన్నారు. విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వసుంధరాదేవి, సిబ్బంది హజరత్, వ ం నోజ్ క ం వ ా ల్ , వె ంక ట ర వ ం ణ రా జు పాల్గొన్నారు.
- ఉదయగిరి రూరల్: గండిపాళెం జలాశయం ప్రాంగణం లో ఉన్న శ్రీసిద్ధేశ్వర స్వామికి మహాభస్మాభిషేకం, సహస్ర జ్యోతిర్లింగార్చన సహిత జ్వాలతోరణ కార్యక్రమాలను అర్చకులు వైభవంగా చేపట్టారు. గ్రామంతోపాటు పరిసర గ్రామాల భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.
- దుత్తలూరు: నర్రవాడ గ్రామ దొడ్డకొండపై ఉన్న శ్రీవెంగమాంబ పేరంటాలమ్మ అమ్మవారికి కార్తీక సోమవారం సందర్భంగా ఆలయ కార్యనిర్వాహణాధికారి వెట్టి గుంట ఉషశ్రీ ఆధ్వర్యంలో అర్చకులు పూజలు నిర్వహించారు. దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.
- బిట్రగుంట: బోగోలు చెన్నకేశవ ఆంజనేయస్వామి ఆలయంలో సామూహిక సత్య నారాయణ స్వామి వ్రతపూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేదపండితులు నరసింహాచార్యులు, నాగేంద్రస్వామి, సత్యనారాయణ చార్యులు శాస్త్రోక్తంగా స్వామివారికి పూజలు జరిపించారు. మధ్యాహ్నం కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో జరిగిన వనభోజన కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. రామస్వామిపాలెంలోని జ్ఞానప్రసన్నంబ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. కార్యక్రమాలో ఈవో రాధాకృష్ణ, పెద్దలు ఉన్నారు.



సంగం: హోమంలో పూర్ణాహుతి వేస్తున్న ఆర్టీసీ రీజనల్ జోనల్ చైర్మన్ సురేష్‌రెడ్డి దంపతులు



ఆత్మకూరులో..

రైల్వే అభివృద్ధికి కలిసి పోరాడుదాం

బిట్రగుంట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వే అభివృద్ధికి సమిష్టిగా పోరాడుదామని నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి అళహరి సుధాకర్ అన్నారు. సోమవారం మండలానికి వచ్చిన ఆయన్ను బీజేపీ మండల అధ్యక్షుడు నూకసాని శ్రీనివాసులు యాదవ్, బిట్రగుంట రైల్వే విశ్రాంత ఉద్యోగులు సన్మానించారు. అనంతరం తహసీల్దారు సురేష్‌బాబును కలిసి రైల్వే ప్రభుత్వ భూముల వివరాలు కోరుతూ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షుడు తిరుమలశెట్టి వెంకటేష్, గోవిందరాజు, విజయరాజు, రాజన్న, భాస్కర్ ఉన్నారు.

జూనియర్, డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయండి

కావలి టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానికంగా ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలను ఏర్పాటు చేయాలని విద్యారంగ హక్కుల సాధన కమిటీ సభ్యులు సోమవారం ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్డీవో, ఎమ్మెల్యే కృష్ణారెడ్డిలను కలిసి వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కమిటీ కన్వీనర్ ఎస్ శ్యామల, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, ఎస్ సుబ్బారావు, గురునాధశర్మ, మాజీ కౌన్సిలర్ మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

ఓవర్‌హెడ్ ట్యాంక్ తొలగించాలని ఆందోళన

సీతారామపురం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో కూలేందుకు సిద్ధంగా ఉన్న ఓవర్ హెడ్ ట్యాంక్‌ను తొలగించాలని సోమవారం గ్రామప్రజలు ఆందోళన చేశారు. గతంలో పంచాయతీ ప్రజలకు నీటి సరఫరా చేసేందుకు వాటర్ ట్యాంక్‌ను నిర్మించారు. నిర్వహణ లోపంతో శ్లాబ్ పెచ్చులు ఊడి పోయి కూలేందుకు సిద్ధంగా ఉంది. వాటర్ ట్యాంకును తొలగించాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు పలుమార్లు మొర పెట్టుకున్నా పట్టించు కోవడంలేదని, ఏదైనా ప్రమాదం జరగకముందే అధికారులు వాటర్ ట్యాంక్ ను తొలగించాలని ప్రజలు కోరారు.

14మద్యం సీసాల పట్టివేత

కావలి రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): చలంచర్లలో సోమవారం బెల్టు దుకాణంపై ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో మద్యం బాటిళ్ల అమ్మకాలు చేపడుతున్న పొట్టపల్లి పుల్లమ్మను అదుపులోకి తీసుకుని ఆమె వద్ద 14 బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు.

చేజర్ల ఎస్ఐగా తిరుమలరావు

చేజర్ల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): చేజర్ల ఎస్ఐగా జే తిరుమలరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషిచేస్తానని తెలిపారు.

ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకోండి

- శరత్, హౌసింగ్ ఏఈ అనంతసాగరం



అనంతసాగరం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఇళ్లు లేని వారు దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల ఇన్‌చార్జి హౌసింగ్ ఏఈ శరత్ తెలిపారు.

ఈ ముఖాముఖి

? పీఎంఏవై 2.0 పథకాకిని ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చా.

! కొత్త గృహాల మంజూరుకు ఆన్‌లైన్ ప్రక్రియ మొదలైంది. విషయంపై ప్రజలకు అవగాహన కల్పిస్తు న్నాం.

? ఆన్‌లైన్‌కు కావల్సిన పత్రాలు ఏమిటీ.. ఎవర్ని సంప్రదించాలి.

! ఆన్‌లైన్ కోసం ఆధార్ కార్డు, రేషన్‌కార్డు, లబ్ధిదారుని ఆదాయం సరిఫికెట్, బ్యాంక్ అకౌంట్, లబ్ధిదారుని ఫోటో, పాన్‌కార్డు, మెయిల్ ఐడీ, ఫోన్ నెంబరు అవస రం. సచివాలయాలు, హౌసింగ్ ఏఈ కార్యాలయాన్ని సంప్ర దించాలి.

? నిర్మాణదశ ఇళ్లకు బిల్లు చెల్లిస్తున్నారా.

! గతంలో ఇళ్ల మంజూరై నిర్మాణదశలో ఉన్న వాటిపై దృష్టి సారించాం. బిల్లులు చెలించేలా చర్యలు తీసుకుం టున్నాం.

? పాతబిల్లుల బకాయిల సంగతేంటి.

! పాతబిల్లుల బకాయిలు చెల్లించే విషయంపై ఉన్నతాధికారుల ఆదేశాలతో సర్వే పూర్తిచేసి నివేదిక అందించాం. మంజూరైన వెంటనే లబ్ధిదారులకు నగదు పడుతుంది.

పనిలో ప్రగతి లేనందుకే బదిలీలు : కమిషనర్

నెల్లూరు(సిటీ), నవంబరు 25(ఆంధ్రజ్యోతి): చేస్తున్న పనిలో ప్రగతి చూపకపోవడం వల్లే కార్పొరేషన్‌లోని రెవెన్యూ విభాగంలో పని చేస్తున్నవారందర్నీ ఒకే సారి బదిలీ చేశామని ఎన్ఎంసీ కమిషనర్ సూర్యతేజ అన్నారు. సోమవారం కమాండ్ కంట్రోల్ భవనంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో ఆయన పాల్గొని నగర వాసుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ నెల్లూరులో వసూళ్లు చేయాల్సిన ఆస్తి పన్ను భారీగా పేరుకుపోయిందని తెలిపారు. ఆర్ఐల వారీగా వివరాలు అందచేయాలని ఆదేశిస్తే సమాధానం లేదన్నారు. పైగా తాను ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన సమయంలో పలు అవకతవలు బహిర్గతమయ్యాయన్నారు. పైగా వీరంతా ఏళ్ల తరబడి ఒకే స్థానంలో ఉన్నారని చెప్పారు. నెల్లూరుకు ఎలాంటి వర్షాలు వచ్చిన ఎదుర్కొనేందుకు తమ యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. తమకు అందిన అర్జీలన్నింటిని నిర్ణీత గడువులోగా పరిష్కరిస్తున్నామన్నారు.


అర్జీదారులతో మాట్లాడుతున్న కమిషనర్ సూర్యతేజ

భక్తిశ్రద్ధలతో కార్తీక సోమవారం పూజలు

నెల్లూరు(సాంస్కృతికం), నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): నగరంలోని శివాలయాల్లో చివరి కార్తీక సోమవారం పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వ హించారు. మూలాపేట మూలస్థానేశ్వరాలయం, నీలకంఠేశ్వర స్వామి, రాజరాజేశ్వరి ఆలయంలో సుందరేశ్వరస్వామి, సుజాతమ్మకాలనీలో ఉమాదేవి నాగేశ్వరస్వామి, శంకర మఠం శివాలయం, నవాబుపేట శివాలయం, ఉస్మాన్‌సాహెబ్ కాశీవిశ్వనాథస్వామి ఆలయంలతోపాటు అన్ని శివాలయాల్లో అభిషేకాలు, పూజలు జరిగాయి. భక్తుల శివనామస్మరణలతో ఆలయాలు మారుమోగాయి. భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి కార్తీక దీపాలు వెలిగించారు. రాత్రి శివపార్వతులకు ప్రాకారోత్సవం జరిగింది. మూలస్థానేశ్వరాలయంలో ఉత్సవాలకు శాంతి హైరర్స్ ఊటుకూరు వెంకటేశ్వర్లు కుటుంబం ఉభయకర్తలుగా వ్యవహరించారు.


అయ్యప్పగుడిలో పడిపూజ చేస్తున్న పండితులు

కనుల పండువగా పడిపూజ

నగరంలోని అయ్యప్పగుడిలో మండల పూజలు ఘనంగా జరుగుతున్నాయి. సోమవారం రాత్రి స్వామివారి 18 మెట్ల పడిపూజ కనుల పండుగగా జరిగింది. ఉదయం సాయంత్రం పాలాభిషేకాలు, గణపతి హోమం, ఉషఃపూజ, శ్రీవేలి ఉత్సవం, కలిశపూజ, ఉచ్ఛపూజ, నవకాభిషేకం, శ్రీవేలి ఉత్సవం, అయ్యప్పలకు అన్నప్రసాదాలు పంపిణీల, పూలంగిసేవ, మహాదీపారాధన, అత్తాళం పూజ, భగవతిసేవలు జరిగాయి. ఉభయదాతలుగా పావళ్ల మాధవి, ప్రసాద్, శివమణికృష్ణ, మణిచందన దంపతులు వ్యవహరించారు. ఆలయ చైర్మన్ జి.శేషగిరి రావు, ప్రధాన కార్యదర్శి కేవీ రత్నం, కోశాధికారి గడ్డం రత్నయ్య పర్యవేక్షించారు.

నెల్లూరులో 100 పడకల ఆసుపత్రి ఏర్పాటు చేయండి

● ఈఎస్ఐసీ డైరెక్టర్‌ను కోరిన ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులో 100 పడకల ఈఎస్ఐ వైద్యశాలను ఏర్పాటు చేయాలని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఈఎస్ఐసీ డైరెక్టర్ జనరల్ అశోక్‌కుమార్‌ను కోరారు. ఢిల్లీలోని ఆయన కార్యాలయంలో సోమవారం మర్యాద పూర్వకంగా కలిసి నెల్లూరులోని ఈఎస్ఐ వైద్యశాల పరిధిలో 2.18 ఎకరాల స్థలం అందుబాటులో ఉన్నందుక 100 పడకల వైద్యశాలను నిర్మించాలని విజ్ఞప్తి చేశారు.

● **లోకసభలో...**

నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సోమవారం లోకసభలో పలు ప్రశ్నలు వేయగా సంబంధిత మంత్రులు సమాధానం ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్‌లో క్రూయిజ్ టూరిజంకు తీసుకుంటున్న చర్యల గురించి వివరించాలని కోరారు. ఇందుకు కేంద్ర పర్యాటకశాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ లిఖిత పూర్వక సమాధానం ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నిరుపేద విద్యార్థులకు అందుతున్న స్కాలర్ షిప్‌లను వివరించాలని, ఖేలో ఇండియా పథకం కింద ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేసిన క్రీడా సదుపాయాలను తెలియచేయాలని కోరారు.


ఈఎస్ఐసీ డైరెక్టర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందచేస్తున్న వేమిరెడ్డి

ప్రజల గుండెచప్పుడుగా పని చేయాలి : ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

నెల్లూరురూరల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కారాలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ వారి గుండెచప్పుడులా నాయకులు పని చేయాలని నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు. టీడీపీ నేత గిరిధర్‌రెడ్డితో కలిసి. సోమవారం 20వ డివిజన్ పరిధిలోని నక్కలగుంటలో టీడీపీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ చేజర్ల మహేష్, నాయకులు సాయిబాబా, దారా మల్లి, ఖాదర్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.


పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న శ్రీధర్‌రెడ్డి

జెండర్‌పై అవగాహన ర్యాలీ


అవగాహన ర్యాలీలో పాల్గొన్న అధికారులు

పొదలకూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో సోమవారం జెండర్‌పై సమాఖ్య సభ్యులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఎంపీడీవో నరసింహరావు, వెలుగు ఏపీఎం చిన్నయ్య, ఆడపిల్లల అక్రమ రవాణా అరికట్టడం, ఆడ, మగ పెంపకంలో తేడా గృహహింస, బాల్య వివాహాలు, వరకట్న సమస్యలపై అవగాహన కలిగించారు. డీఆర్‌డీఏ జెండర్ వివక్షపై స్వయం సహాయ బృందాల సభ్యులకు అవగాహన కల్పించారు. వారందరితో ఎంపీడీవో కార్యాలయం నుంచి గేట్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు.

శ్మశానానికి దారి చూపండి

తహసీల్దారుకి టీడీపీ నేతల వినతి

విడవలూరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వీరారెడ్డిపాళెం గిరిజన కాలనీకి చెందిన శ్మశానానికి దారి చూపాలంటూ స్థానిక టీడీపీ నాయకులు తూళ్లూరు మాధవ్, తిమ్మరాజు తిరుపతి, కొండా రఘు, చౌటూరు శ్రీను సోమవారం తహసీల్దారు చంద్రశేఖర్‌ని కలసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ శ్మశాన వాటికకి వేళ్లే దారి కుచించుకుని పోయిందన్నారు. దానివలన కాలనీలో ఎవరైన చనిపోతే మృతదేహాన్ని రైతుల పొలాల మీదుగా తీసుకుని పోవాల్సి వస్తోందన్నారు. అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు.

రెండు నెలల్లో ట్రాఫిక్ సిగ్నల్స్

● రెండు విడతల్లో ఏడుచోట్ల ఏర్పాటు
● సీసీ కెమెరాల ఏర్పాటు, కమాండ్ కంట్రోల్‌కు అనుసంధానం

నెల్లూరు(క్రైం), నవంబరు 25(ఆంధ్రజ్యోతి): నెల్లూరు నగరం పేరు వింటేనే గుర్తుకు వచ్చేది ట్రాఫిక్ సమస్య దీంతో ప్రజలు నరకయాతన పడుతున్నారు. ఈ క్రమంలో గతంలో అనేకసార్లు ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేసినా పెద్దగా ప్రయోజనం లేకపోవడంతో సిగ్నల్ వ్యవస్థను తొలగించారు. అయితే ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో నెల్లూరు కార్పొరేషన్ కమిషనర్, జిల్లా ఎస్పీ, ఇతర అధికారులు సంయుక్తంగా సిగ్నల్ వ్యవస్థపై చర్చించి ఏడు ప్రాంతాల్లో రెండు విడతల్లో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. దీని రూట్‌మ్యాప్ తుది మెరుగులు దిద్దుకుంటుంది.

ఏడు ప్రాంతాల్లో ఏర్పాటు

నగరంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ ఆదేశాల మేరకు ఏడు కూడళ్లలో రెండు దశల్లో ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ఏర్పాటు చేయనున్నారు. మొదటి దశలో ఏసీ కూరగాయల మార్కెట్, కేవీఆర్ పెట్రోల్ బంకు, కనక మహల్ కూడళ్లలో ఏర్పాటు చేయనున్నారు. రెండవ దశలో జిల్లా పోలీసు కార్యాలయం, హరనాథపురం, రామలిగాపురం, వీఆర్‌సీ కళాశాల కూడళ్లలో ఏర్పాటు చేస్తారు. ఇవి రెండు నెలల్లో అందుబాటులోకి రానున్నాయి. ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థ ప్రాజెక్టును ఎన్‌పీటీ నెట్వర్క్ సంస్థతో రెండేళ్ల నిర్వహణ ఒప్పదం చేసుకున్నారు. రూ.1.39 కోట్లతో ఈ ప్రాజెక్టు మొత్తాన్ని పూర్తి చేయనున్నట్లు గతంలో కార్పొరేషన్ కమిషనర్ సూర్యతేజ, ఎస్పీ కృష్ణకాంత్‌తో జరిగిన సమావేశంలో తెలిపారు.

కమాండ్ కంట్రోల్‌కు అనుసంధానం

ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థను పోలీసు కమాండ్ కంట్రోల్ రూమ్‌తో అనుసంధానం చేయనున్నారు. వీటితో పాటు ట్రాఫిక్ సిగ్నల్ ఏర్పాటు చేసిన ప్రాంతంలోనే సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి వాటి సీసీ ఫుటేజ్‌లను కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేస్తారు. ఉదయం, సాయంత్రం ట్రాఫిక్ అధికంగా ఉన్న సమయంలో ట్రాఫిక్, స్థానిక పోలీసులు విధులు నిర్వహిస్తారు. ట్రాఫిక్ పెద్దగా లేని సమయంలో పూరిగా ఎల్లో సిగ్నల్ వేస్తూ.. ట్రాఫిక్ జామ్ అయితే కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సీసీ ఫుటేజ్‌ల ఆధారంగా పక్కనే ఉన్న సిబ్బందిని ఆ ప్రాంతానికి పంపిస్తారు. ఇక సిగ్నల్స్ ఏర్పాటు చేసిన ప్రాంతాల్లో మైక్‌లను సైతం ఏర్పాటు చేసి కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తున్న వారిని హెచ్చరిస్తుంటారు. దానితో పాటు ట్రాఫిక్ నియమాలు, చట్టాలపై అవగాహన కల్పిస్తుంటారు.



రెండు నెలల్లో ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థ


నగర ప్రజలను ట్రాఫిక్ నుంచి బయటకు తీసుకు వచ్చేందుకు సిగ్నల్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకు వస్తున్నాం. ప్రస్తుతం రెండు విడతల్లో ఏడు ప్రాంతాల్లో సిగ్నల్ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నాం. ఆ తర్వాత నగరంలోని ఆనేక ప్రాంతాలకు విస్తరించేందుకు జాబితాను సిద్ధం చేసి అధికారులకు అందిస్తాం.

- జీ కృష్ణకాంత్, జిల్లా ఎస్పీ

పోస్టాఫీసులో పోస్టల్ బ్యాంకు ఖాతాలు తెరవండి

నెల్లూరు(సాంస్కృతికం), నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్టోన్‌హౌస్‌పేట పోస్టాఫీసు పరిధిలోని ప్రజలందరూ (ఐపీపీబీ) పోస్టల్ బ్యాంకు ఖాతాలు తెరిచి, తమ ఆర్థిక లావాలు సులభంగా చేసుకోవచ్చని స్టోన్‌హౌస్‌పేట పోస్టాఫీసు మేనేజర్ యు.రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోస్టల్ బ్యాంకులో డబ్బులు దాచుకోవడంతోపాటు తమరు ఇంటి నుంచే ఆ బ్యాంకు ఖాతా ద్వారా బ్యాంకింగ్ సేవలు, ఇంటర్నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్ ఏటీఎం, ప్రభుత్వ సేవలను పొందవచ్చని పేర్కొన్నారు.

ఆరోగ్య కేంద్రాల్లో తనిఖీ


రికార్డులను పరిశీలిస్తున్న డాక్టర్ ఖాదర్‌వలి

నెల్లూరు(వైద్యం), నవంబరు 25(ఆంధ్రజ్యోతి): నగరంలోని రాజాగారివీధి, మల్లికార్జున పురం తదితర పట్టణ ఆరోగ్య కేంద్రాలను అదనపు జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఖాదర్‌వలి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా కేంద్రాల్లో రికార్డులు పరిశీలించారు. క్షయ, కుష్ఠు, హెచ్ఐవీ వ్యాధిగ్రస్థుల వివరాలు, అందిస్తున్న వైద్య చికిత్సలు తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

కాలువల్లో పూడికతీతపై హర్షం

తోటపల్లిగూడూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కూటమి పాలనలో రైతాంగానికి అవసరమైన ప్రధాన పారుదల కాలువల్లో పూడికతీత పనులు చేపట్టడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నట్లు తెలుగుదేశం యువనేత మొగలిగుంట పోతన తెలిపారు. సోమవారం ఆయన సౌత్‌ఆములూరు, నీటి సంఘ పరిధిలోని ముంగలదొరువు కాలువ పనుల పరిస్థితిపై మాట్లాడారు. వైసీపీ హయాంలో ఈ పనులు చేపట్టక పోవడంతో రైతుల పొలాలకు నీరు అందలేదన్నారు. సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కాలువలపై ప్రత్యేక దృష్టి పెట్టి ఈ పనులు చేయించారన్నారు. కార్యక్రమంలో స్థానిక రైతులు ఎస్.రమేష్, డి.సురేంద్ర, కోనేటి వాసు, యామాలయ్య దగ్గు మహేష్, కోనేటి సిద్ధయ్య ఉన్నారు.

లింగ నిర్ధారణ సరికాదు : ఎంపీడీవో

నెల్లూరురూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ వ్యాప్తంగా పరుగుతీస్తున్న ఆధునిక యుగంలో లింగ వివక్ష సరికాదని ఎంపీడీవో శైలేంద్రకుమార్ అన్నారు. సోమవారం నెల్లూరు రూరల్ ఏపీఎం రోజ్‌మేరి ఆధ్వర్యంలో వెలుగు కార్యాలయం వద్ద అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లింగ నిర్ధారణకు ఎవరైన పాల్పడితే వారిని కఠినంగా శిక్షించాలని తెలిపారు. డిసెంబరు 23వ తేదీ వరకు ఈ అవగాహన ర్యాలీలు కొనసాగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో లక్ష్మీదేవి, ఇతర మండల అధికారులు, పొదుపు మహిళలు పాల్గొన్నారు.


ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

ఎన్‌సీసీ బెస్ట్ క్యాడెట్‌గా విష్ణువర్ధన్ సింగ్

నెల్లూరు(విద్య), నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): నగరంలోని చిన్న బాలయ్య నగర్ నగరపాలక ఉన్నత పాఠశాలకు చెందిన ఎన్‌సీసీ కేడెట్ సీహెచ్.విష్ణువర్ధన్ సింగ్ జిల్లా బెస్ట్ క్యాడెట్ అవార్డుకు ఎంపికయ్యారు. ఎన్‌సీసీ డే వేడుకల్లో భాగంగా గుంటూరులో జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో గ్రూప్ కమాండర్ కల్నల్ ఎం.చంద్రశేఖర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. దీంతో సోమవారం పాఠశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో 24 ఆంధ్రా బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ డి.కరంచంద్, ప్రధానోపాధ్యాయిని జాస్మినమ్మ, ఇన్‌చార్జి గౌస్‌మెహిద్దీన్, ఎన్‌సీసీ చీఫ్ ఆఫీసర్ కె.బాలబ్రహ్మచారి, ఉపాధ్యాయులు, ఆర్మీసిబ్బంది క్యాడెట్‌ను అభినందించారు.



అవార్డు అందుకుంటున్న విష్ణువర్ధన్

తాతయ్యబడిలో అమ్మపేరుతో మొక్క

నెల్లూరు(విద్య), నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): నెహ్రూ యువకేంద్ర, కమ్యూనిటీ పారామెడికల్స్ అండ్ ప్రైమరీ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, యువజన సర్వీసులశాఖ సంయుక్త ఆధ్వర్యంలో నగరంలోని వెంగళరావునగర్ నగరపాలక ఉన్నత పాఠశాల(తాతయ్యబడి)లో సోమవారం అమ్మ పేరుతో ఒక మొక్క కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వెంగళరావునగర్ పట్టణ ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ భారతి, సెట్నెల్ సీఈవో బి.శ్రీనివాసరావు, ఎన్‌వైకే అధికారి మహేంద్రరెడ్డి, పీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్, నేతలు గోరంట్ల శేషయ్య, దేవరకొండ శ్రీనివాసులు, షేక్.రసూల్, హెచ్ఎం భూషణ్‌కుమార్ పాల్గొన్నారు.


మొక్కలు నాటుతున్న అధికారులు

ఆగిన నెట్.. సేవలు బంద్

మనుబోలు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని రెండు సచివాలయాల్లో నాలుగురోజులుగా అంతర్జాలం (నెట్) సేవలు నిలిచిపోయాయి. సచివాలయం ద్వారా ప్రజలకు అందించాల్సిన సేవలకు అంతరాయం కలుగుతోంది. సచివాలయాలే కాకుండా తహసీల్దార్ కార్యాలయంలో కూడా ఈ సమస్య ఉండటంతో సోమవారం కలెక్టర్ వీసీ కోసం తహసీల్దార్, ఎంపీడీవోలు వెంకటాచలం మండలానికి వెళ్లారు. సచివాలయ సిబ్బంది ప్రజలకు ధృవీకరణ పత్రాలు, ఇతర సేవలు అందించాల్సి వచ్చినప్పుడు ఫోన్‌నెట్ ద్వారా అందిస్తున్నారు. అయితే వచ్చిన ప్రజల నుంచి ఫోన్‌లో నెట్ తీసుకుని వాడుకునే పరిస్థితి. నెట్ లేకపోవడంతో పూర్తిస్థాయిలో సేవలు, అంతర్జాలంలో ఇతర వివరాలు నమోదు చేయడం కష్టతరంగా మారింది. దీనిపై అధికారులు స్పందించి సచివాలయాలకు. కార్యాలయాలకు నెట్ సౌకర్యం అందించాల్సి ఉంది.

శివనామ స్మరణతో మారుమోగిన ఆలయాలు

బుచ్చిరెడ్డిపాళెం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కార్తీక సోమవారం సందర్భంగా భక్తుల శివనామ స్మరణతో ఆలయాలు మారుమోగాయి. బుచ్చి నగర పంచాయతీలోని పెద్దూరు శివాలయం, కనిగిరి రిజర్వాయర్‌వద్ద శివలింగం, దుర్గామల్లేశ్వరాలయం, మండలంలోని దామరమడుగు, రేబాల, కాకొల్లు, పెనుబల్లి, మునులపూడి, రెడ్డిపాళెం, మినగల్లులోని శివాలయం, పలు శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.


విడవలూరు శివాలయంలో పూజలు చేస్తున్న టీడీపీ నేతలు

జొన్నవాడలో...

మండలంలోని జొన్నవాడ ఆలయంలో కార్తీక సోమవారం సందర్భంగా ఆలయంలో శ్రీ మల్లికార్జునస్వామికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అమ్మవారికి శ్రీచక్ర నవావరణ పూజలు వైభవంగా జరిగాయి. భక్తులు ఆలయం చుట్టూ కార్తీకదీపాలు వెలిగించారు. అనంతరం భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఎవీ శ్రీనివాసులురెడ్డి కార్యక్రమాలను పర్యవేక్షించారు.

సిద్ధలకోనలో...

సైదాపురం: మండలంలోని సిద్దేశ్వర కోనలో నాలుగో కార్తీక సోమ వారం తిరునాళ్ళ నిర్వహించారు. ఈసందర్భంగా నవకోటి సిద్దేశ్వర, నవనాథ సిద్దేశ్వర, శిష్యుడు సారంగధర స్వాముల వారికి దేవరులు విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. చివరి కార్తీక సోమవారం కావడంతో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనడంతో శివనామ స్మరణతో సిద్దలకోన మారుమోగింది. మహిళలు దీపారాధనలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. మేధా దక్షిణామూర్తిస్వామి దేవస్థానం వ్యవస్థాపకుడు పాలడుగు వెంకటసాయి ఆధ్వర్యంలో సత్యనారాయణస్వామి కల్యాణం, వ్రతం, హోమం, పూజలు నిర్వహించారు. ఒగ్గు కిష్టయ్య అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఘనంగా లక్షదీపోత్సవం

విడవలూరు: స్థానిక శివాలయంలో లక్షదీపోత్సవం ఘనంగా నిర్వహించారు. శివభక్తుల ఆధ్వర్యంలో జరిగిన ఈవేడుకల్లో టీడీపీ మండల ఇన్‌చార్జి అడపాల శ్రీధర్‌రెడ్డి, నాయకులు పాశం శ్రీహరిరెడ్డి, సత్యవోలు సత్యంరెడ్డి, పూండ్ల హరిరెడ్డిలు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వ హించారు. ఆలయ పూజారి స్వామి, అమ్మవార్లకి అభిషేకాలు, అర్చనలు, రుద్రాభిషేకాలు చేశారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులు కార్తీక దీపాలను వెలిగించారు. భక్తులకు ఉత్సవ నిర్వాహకులు అన్నప్రసాదాలను పంచారు.

ఘనంగా పల్లకీసేవ

మనుబోలు: స్థానిక కామాక్షితాయి బ్రహ్మేశ్వర ఆలయంలో కార్తీకమాసం చివరి సోమవారం సం దర్భంగా స్వామివారికి అర్చకులు సర్వే పల్లి ఫణీంద్రశర్మ అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పార్వతీ, పరమేశ్వరులను ప్రత్యేక అలం కరించి పల్లకీసేవ నిర్వహించారు. ఆలయంలో శివలింగ ఆకృతిలో దీపాలు వెలిగించి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. పూజా కార్యక్రమాలకు కాంద్ర బ్రదర్స్ ఉభయదాతలుగా వ్యవహరించారు.

● పొదలకూరు: పట్టణంలోని లింగేశ్వరునికి కార్తీక మాస చివరి సోమ వారం భక్తులు క్షీరాభిషేకం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో అయ్యప్పస్వామి యువజన సేవా సమాజ సభ్యులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఉచితంగా ఉపకరణాల పంపిణీ

బుచ్చిరెడ్డిపాళెం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): వెంకటాచలంలోని దివ్యాంగుల పునరావాస కేంద్రం వద్ద దివ్యాంగులకు ఉపకరణాలు ఉచితంగా అందించేందుకు సోమవారం బుచ్చి ఎంపీడీఓ కార్యాలయంలో కేంద్ర ప్రభుత్వ సంస్థ సీఆర్‌సీ నెల్లూరు వారు రాజేష్, రఘు శిబిరం నిర్వహించారు. నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని దివ్యాంగుల కోసం ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిబిరానికి మండల వ్యాప్తంగా 80 మంది దివ్యాంగులు హాజరుకాగా వారిలో 18మందికి వీల్‌చైర్స్, 5మందికి వాకర్స్, 20మందికి మూడు చక్రాల బ్యాటరీ బండ్లు, 30మందికి వినికిడి పరికరాలు, నలుగురికి టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్, 10మందికి 3చక్రాల బండ్లు పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈకార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీహరి, ఎంపీపీ శ్రీనివాసులు, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.


ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన శిబిరం

న్యూస్ బాక్స్

వినికిడి మిషన్ పంపిణీ

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట), నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): చెవులు వినిపించక పోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నగరంలోని కొరడా వీధికి చెందిన షేక్ ఖలీల్‌కు నగరంలోని రాజేంద్రనగర్‌లో ఉన్న బీజేపీ కార్యాలయంలో జిల్లా ప్రధాన కార్యదర్శి యశ్వంత్‌సింగ్ ఆధ్వర్యంలో సోమవారం రూ.25 వేలు విలువ చేసే వినికిడి మిషన్ అందచేశారు. తెల్లరేషన్ కార్డు కలిగి వినికిడి సమస్య ఉన్న వారికి బీజేపీ ఆధ్వర్యంలో ఉచితంగా వినికిడి మిషన్‌లను పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఖాదర్, పెంచలయ్య, హేమంత్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు విద్యార్థుల చేయూత

నెల్లూరు(విద్య), నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): నగరంలోని రిత్విక్ ఎన్‌క్లేవ్‌లో ఉన్న డాక్టర్ కిషోర్స్ రత్నం థింక్ నెక్స్ స్కూల్ విద్యార్థులు కమ్యూనిటీ సర్వీస్ హ్యాండ్స్ టూ హ్యాపీనెస్ కార్యక్రమంలో భాగంగా సోమవారం నారాయణరెడ్డిపేటలో విశ్వజన ని అనాథశరణాలయం, బాపూజీ వృద్ధుల ఆశ్రమాన్ని సందర్శించారు. వారు సేకరించిన నిత్యావసరాలను అందచేశారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల డైరెక్టర్‌లు డాక్టర్ కె.కృష్ణకిషోర్, వాసంతి, పాఠశాల డెరెక్టర్ రోషిణి, ప్రిన్సిపాల్ కళ్యాణి, మేనేజర్ రాజేష్ బాబు పాల్గొన్నారు.

జాతీయ సాఫ్ట్‌బాల్‌కు మానస


మానసను అభినందిస్తున్న హెచ్ఎం

నెల్లూరు(విద్య), నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఫత్తేఖాన్‌పేట నగరపాలక ఉన్నత పాఠశాల(రామయ్యబడి)లో 8వ తరగతి విద్యార్థిని ఎస్.మానస జాతీయ సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా సోమవారం పాఠశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఈ.వేదమూర్తి మాట్లాడుతూ చిత్తూరు జిల్లా అరగొండ జడ్పీ ఉన్నత పాఠశాలలో ఈనెల 22 నుంచి 24వ తేదీ వరకు జరిగిన అండర్-14 రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో జిల్లా జట్టులో పాల్గొన్న మానస అత్యుత్తమ ప్రతిభ కనబరిచి మహారాష్ట్రలో జనవరిలో జరిగే జాతీయ పోటీలకు ఎంపికైందన్నారు. తల్లిదండ్రుల ప్రోత్సాహం, పీఈటీ జే వెంకట్రావ్ శిక్షణతో ఇది సాధ్యమైందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

మైనింగ్ మాఫియాపై చర్యలు తీసుకోవాలి

సైదాపురం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో అక్రమ మైనింగ్ మాఫియాపై చర్యలు చేపట్టాలని వెంకటగిరి నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి పంటా శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఆయన మాట్లాడుతూ మళ్లీ అక్రమ మైనింగ్ మొదలవుతోందని, వైసీపీ ప్రభుత్వంలో మైనింగ్ దోచుకున్నవారే టీడీపీ ప్రభుత్వంలో కూడా దోచుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పూల చంద్రశేఖర్, క్రిష్ణయ్య, డక్కిలి కృష్ణమోహన్, సుబ్రహ్మణ్యంరాజు, బ్రహ్మయ్య, సుమన్, పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాలో అవకతవకలపై కలెక్టరుకు రైతుల ఫిర్యాదు

విడవలూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): నీటి సంఘాల ఓటర్ల జాబితా తప్పులతడకలుగా ఉందని విడవలూరు చెరువు ఆయకట్టు దారులు సోమవారం జిల్లా కలెక్టరు ఆనంద్‌కు గ్రీవెన్స్‌సెల్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా రైతు పొన్నలూరు పురందర్‌రెడ్డి మాట్లాడుతూ నీటి సంఘాల ఎన్నికల ఓటర్ల జాబితాలో అవకతవకలు ఉన్నాయని ఫిర్యాదు చేసినా అధికారులు తప్పుడు తడకలుగా ఉన్న జాబితాని ప్రచురించారని తెలిపారు. ఈ విషయంపై సమగ్రమైన విచారణ జరపాలన్నారు.

అనుమతి లేని విగ్రహాలను తొలగించాలి

పొదలకూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో అనుమతి లేకుండా మాజీ మంత్రి ఏర్పాటుచేసిన తండ్రి విగ్రహాలను తొలగించాలని సర్వేపల్లి నియోజకవర్గం జనసేన సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్ కోరారు. సోమవారం ఎం పీడీవో కార్యాలయంలో ఎంపీడీవో నర సింహంకు జనసేన నాయకులతో కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నరదాసు రవి, బండి మనోజ్, కొమ్మల ప్రసాద్, పెంచలయ్య, ప్రవీణ్, గిరీష్, పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

ఇందుకూరుపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొత్తూరు, రాపూరు డొంకలోని గిరిజన కాలనీ వాసులకు ఏఆర్‌డీ స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకులు బషీర్ ఆధ్వర్యంలో సోమవారం టార్పాలిన్ పట్టలు, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నాగేంద్రబాబు, తహసీల్దారు, మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి మునగాల రంగారావు, పేడూరు రామచంద్రయ్య, ఉదయ్‌కుమార్, బాలయ్య, శేషయ్య, వెంకటరమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట	: 99854 38368
చిత్తూరు, పూతలపట్టు, గంగాధర నెల్లూరు	: 99854 10940
పలమనేరు, కుప్పం, పుంగనూరు	: 97036 18724
మదనపల్లి, పీలేరు, తంబళ్లపల్లి	: 99854 22298
శ్రీకాళహస్తి, పుత్తూరు, నగరి, సత్యవేడు	: 99890 59755



గోల్డ్ మ్యాన్

మెడలో లావుపాటి గొలుసు. చేతులకు పెద్దపెద్ద కడియాలు. వేళ్లకు ఉంగరాలు. ఇలా ఒంటిపైన రూ.కోటికిపైగా బంగారంతో సోమవారం తిరుపతి కలెక్టరేట్‌కు వచ్చారు వ్యాపారి షణ్ముఖం. ఈయన్ను అర్జీదారులు ఆసక్తిగా చూశారు. 'గోల్డ్ మ్యాన్' అంటూ ఆయన్ను పలువురు పిలిచారు. తిరుమలలో తనకు హోటల్ వ్యాపారం ఉందని, చిన్నపనిపై కలెక్టరేట్‌కు వచ్చానని ఆయన చెప్పారు.

- తిరుపతి కలెక్టరేట్, ఆంధ్రజ్యోతి

నాయీ బ్రాహ్మణుల సంక్షేమమే లక్ష్యం

కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన సదాశివం



తిరుపతి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): నాయీ బ్రాహ్మణుల సంక్షేమాభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తానని ఆ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం చెప్పారు. విజయవాడలోని గొల్లపూడి బీసీ భవనంలో సోమవారం ఏపీ నాయీ బ్రాహ్మణ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా ఆయన బాధ్యతలు స్వీకరించారు. టీడీపీలో కష్టపడిన కార్యకర్తలకు తగిన గుర్తింపు ఉంటుందని చెప్పడానికే తానే నిదర్శనమన్నారు. స్టేట్ డైరెక్టర్లు, జిల్లాల నుంచి హాజరైన నాయీ బ్రాహ్మణ సంఘం నాయకుల సమక్షంలో సదాశివం బాధ్యతలు స్వీకరించారు. ఆయన్ను పలువురు సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు.

కార్తీక సందడి

కార్తీక మాసం నాలుగో సోమవారం. జిల్లాలోని శైవాలయాలు భక్తులతో సందడిగా మారాయి. ఆయా ఆలయాల ప్రాంగణాలు, పుష్కరిణిల వద్ద భక్తులు కార్తీక దీపాలు వెలిగించారు. పిండి తలిగలు వేసి మొక్కులు తీర్చుకున్నారు.

కార్తీక దీపాల వెలుగులు 6లో



ఆంగ్లోపాధ్యాయుడు

శ్రీనివాసులు సస్పెన్షన్

తిరుపతి(విద్య), నవంబరు 25(ఆంధ్రజ్యోతి):తిరుపతిలోని రాజీవ్ గాంధీ కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయుడు జె. శ్రీనివాసులును సస్పెండ్ చేస్తూ సోమవారం రాత్రి డీఈవో కేవీఎన్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.కొన్ని సంవత్సరాలుగా ఎక్కడ పనిచేస్తే అక్కడ వివాదాస్పదంగా వ్యవహరిస్తుండడంతో శ్రీనివాసులును సస్పెండ్ చేసినట్టు ఆయన వివరించారు.డీఈవో కథనం మేరకు.... స్కూల్ అసిస్టెంట్ జె. శ్రీనివాసులు 2017లో పాకాలలోని జడ్పీ హైస్కూల్లో పని చేసినప్పుడు ప్రాజెక్ట్ వర్క్ చేయలేదని విద్యార్థులను విచక్షణారహితంగా కొట్టడంతో విచారణ జరిపి తాత్కాలికంగా విధుల నుంచి తప్పించారు.సత్యవేడు మండలం దాసకుప్పం జడ్పీ హైస్కూల్లో పనిచేసినపుడు తరచూ హెచ్ఎంతో పాటు సహోపాధ్యాయులతో గొడవపడుతుండడంతో శాఖాపరమైన విచారణ జరిపి తిరుపతికి బదిలీ చేశారు.తిరుపతిలోని రాజీవ్‌గాంధీ కాలనీ జడ్పీహెచ్‌కు బదిలీపై వచ్చిన తరువాత ఇక్కడి ప్రధానోపాధ్యాయుడితో, సహోపాధ్యాయులతో గొడవపడడం ప్రారంభించడంతో ఉప విద్యాశాఖాధికారి ఆనంద్ రెడ్డి విచారణ జరిపారు. ప్రశాంతంగా సాగాల్సిన బోధన శ్రీనివాసులువల్ల కుంటుపడుతోందని, ఆయన్ను వేరే పాఠశాలకు బదిలీ చేయాలని నివేదిక ఇచ్చారు. దీంతో శ్రీనివాసులును ఎస్వీజేఎన్ఎం పాఠశాలకు వర్క్ అడ్జస్ట్‌మెంట్ కింద బదిలీ చేశారు.అయితే అక్కడి ప్రధానోపాధ్యాయుడు తన మెడికల్ బిల్లులు పాస్ చేయలేదని, తోటి ఉపాధ్యాయులు తనని ఇబ్బంది పెడుతున్నారనే ఆభియోగాలతో శ్రీనివాసులు లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. లోకాయుక్త ఆదేశాల మేరకు ప్రస్తుత ఉప విద్యాశాఖాధికారి బాలాజీ విచారణ జరిపించారు. అయితే ప్రధానోపాధ్యాయుడు కానీ, ఇతర ఉపాధ్యాయులు కానీ శ్రీనివాసులును ఏవిధంగానూ ఇబ్బంది పెట్టలేదని విచారణాధికారి నివేదిక సమర్పించారు. ఇదిలా ఉండగా గతంలో దాసకుప్పం ఘటనలపై విచారణ జరిపిన త్రిసభ్య కమిటీ సభ్యులతో పాటు కొందరు అధికారులపై పలురకాల ఆరోపణలు చేస్తూ.. తన వాట్సాప్ గ్రూప్‌లో అసభ్యకరమైన మాటలతో వీడియోలు, సందేశాలను శ్రీనివాసులు పంపించారు. అలాగే తనపై విచారణ జరిపిన తిరుపతి ఉప విద్యాశాఖాధికారిపై సోషల్ మీడియాలో అసభ్యకరమైన ప్రచారం చేయడం ప్రారంభించారు.ఈ విషయంపై ఉప విద్యాశాఖ అధికారి బాలాజీ డీఈఓకు ఇటీవల ఫిర్యాదు చేశారు.దీనిపై సంజాయిషీ కోరుతూ శ్రీనివాసులుకు డీఈవో నోటీసు జారీ చేశారు. అయితే సంజాయిషీలో పొంతనలేని సమాధానం ఇచ్చారని డీఈవో వెల్లడించారు.ఎన్నిసార్లు హెచ్చరించినా తీరు మార్చుకోకపోవడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శ్రీనివాసులును సస్పెండ్ చేసినట్టు డీఈవో తెలిపారు.

శ్రీవారి హుండీ ఆదాయం

రూ.4.14 కోట్లు

తిరుమల, నవంబరు25(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వర స్వామికి హుండీ ద్వారా రూ.4.14 కోట్లు లభించింది. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ ఆదివారం లెక్కించింది. ఈ వివరాలను టీటీడీ సోమవారం ఉదయం ప్రకటించింది. ఇక, ఆదివారం 75,737 మంది శ్రీవారిని దర్శించుకోగా, 23,208 మంది తలనీలాలు సమర్పించారు

నేడు జాతీయ పాల దినోత్సవం

రైతుకు భరోసా పాడి

నేల.. రైతు నమ్మకాన్ని వమ్ము చేసినా, పశువు రైతుకు అమ్మగా మారింది. ప్రకృతి వైపరీత్యాలు, చీడ పీడలు, ధరల ఒడిదుడుకులు చేసిన కష్టాన్ని వెక్కిరించి ఆత్మహత్యల దిశగా నడిపిస్తే.. పెంచిన పశువు మాత్రం పాల ధారతో రైతు బతుక్కి భరోసాగా నిలచింది. తిరుపతి జిల్లాలో రెండు లక్షల కుటుంబాలకు పాడి పరిశ్రమే ఉపాధిగా మారింది. 2.59 లక్షల పాడియావులు, 2.69 లక్షల గేదెలు పాడి రైతును కాపాడుతున్నాయి.



రోజూ 13.61 లక్షల లీటర్ల పాలు

జిల్లాలో ఆవులు, గేదెల సంఖ్య 5 లక్షలకు పైగా వున్నా వాటిలో పాలిచ్చే ఆవులు 1.17 లక్షలు మాత్రమే. అలాగే పాలిచ్చే గేదెలు 97 వేలు. వీటి ద్వారా రోజువారీ 13.61 లక్షల లీటర్ల పాల దిగుబడి వస్తోంది. ఇందులో 1.35 లక్షల లీటర్ల పాలు రైతు కుటుంబాలు వినియోగిస్తుండగా 12.26 లక్షల లీటర్ల పాలను వివిధ ప్రభుత్వ, సహకార, ప్రైవేటు డెయిరీలు సేకరిస్తున్నాయి.

జిల్లాలో ఉన్న గేదెలు

దేశవాళీ గేదెలు, ముర్రా జాతి గేదెలు, గ్రేడెడ్ ముర్రా జాతి గేదెలు వంటి రకాలున్నాయి.



ఇల్లు గడుస్తోంది

బర్రెల పెంపకంతోనే మాకు ఇల్లు గడుస్తోంది. మాకున్న రెండు ముర్రాజాతి బర్రెల్లో ఒక్కోటి ఉదయం ఐదు లీటర్లు, సాయంత్రం ఐదు లీటర్లు చొప్పున రోజుకు 20 లీటర్ల పాలిస్తున్నాయి. ఆ పాలు అమ్మడం ద్వారానే పిల్లల్ని కూడా చదివించుకుంటున్నా.

-చిరంజీవి, నాగవోలు గ్రామం, దక్కిలి మండలం

జిల్లాలో ఉన్న ఆవులు

నాటు లేదా దేశవాళీ ఆవులు, ఒంగోలు జాతి ఆవులు, జెర్సీ సంకర జాతి ఆవులు, హెచ్ఎఫ్ సంకర జాతి ఆవులు, హలికర్, పుంగనూరు జాతి ఆవులు వంటి రకాలున్నాయి. ఇందులో హలికర్, పుంగనూరు జాతుల ఆవుల సంఖ్య చాలా స్వల్పం.

47 డెయిరీలు

జిల్లాలో మొత్తం 47 డెయిరీలున్నాయి. అందులో నాలుగు ప్రభుత్వ సహకార రంగానికి చెందినవి కాగా మిగిలిన 43 డెయిరీలు ప్రైవేటువి. చిల్లింగ్ సెంటర్లు 19 వుండగా అందులో సహకార రంగానికి చెందినవి మూడు కాగా మిగిలిన 16 ప్రైవేటువి. ఇవి కాకుండా డీఆర్‌డీఏ పరిధిలో జిల్లా మహిళా సమాఖ్య నిర్వహిస్తున్న బీఎంసీయూలు 15 వున్నాయి. 60 వేల లీటర్ల సామర్థ్యంతో ఏర్పాటైన ఈ బీఎంసీయూల పరిధిలో 401 పాల సేకరణ కేంద్రాలు నడుస్తున్నాయి. వీటి ద్వారా 6354 మంది పాడి రైతులు 41,670 లీటర్ల పాలను బీఎంసీయూలకు సరఫరా చేస్తున్నారు.

18 లీటర్ల పాలిచ్చే ఆవులు

ఆవు జాతుల్లో హెచ్ఎఫ్ సంకర జాతి, జెర్సీ సంకర జాతి ఆవులు పాల దిగుబడి అధికంగా ఇస్తున్నాయి. హెచ్ఎఫ్ జాతి ఆవు సగటున రోజుకు 16-18 లీటర్ల పాలు ఇస్తుండగా జెర్సీ ఆవు రోజుకు సగటున 10-14 లీటర్ల పాలు ఇస్తుంది.

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పదిలక్షలకు పైగా ఆవులు, ఎనుములు ఉండేవి. పాడి ఉత్పత్తిలో రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉండేది. విభజన తర్వాత ఏర్పడిన తిరుపతి జిల్లా ఆ స్థానాన్ని కోల్పోయినా రైతుకు భరోసాని కొనసాగిస్తూనే ఉంది. సెంటు భూమి లేకున్నా, ఉద్యోగ వ్యాపారాలు లేకున్నా లక్షల కుటుంబాలు పాడి మీద ఆధారపడి సంతోషంగా జీవించగలుగుతున్నాయి.

12 లీటర్ల పాలిచ్చే గేదెలు

గేదె జాతుల్లో ముర్రా, గ్రేడెడ్ ముర్రా జాతుల గేదెలు ఎక్కువగా పాల దిగుబడి ఇస్తున్నాయి. ముర్రా జాతి గేదె సగటున రోజుకు 11-12 లీటర్ల పాలు ఇస్తుంది. గ్రేడెడ్ ముర్రా జాతి గేదె సగటున 6-8 లీటర్లు చొప్పున ఇస్తుంది.

గేదెలు .. రకాలు	
నాటు గేదెలు:	1.02 లక్షలు
గ్రేడెడ్ ముర్రా జాతి:	1.21 లక్షలు
ముర్రా గేదెలు:	32,500



ఇదే పుంగనూరు ఆవు!

కోట మండలం గూడలి గ్రామంలో రైతు కన్నా వెంకట శేషయ్య పోషిస్తున్న పుంగనూరు జాతి ఆవు ఇది. చూడ్డానికి దూడలా ముచ్చటగొలుపుతున్న ఈ పొట్టిరకం ఆవు రోజుకు ఏడు లీటర్ల దాకా పాలిస్తోంది. దీన్ని పలమనేరు మండలం బంగారుపేట నుంచీ రెండేళ్ల కిందట రూ. 40 వేలు పెట్టి కొనుగోలు చేశారాయన. స్థానికంగా పుంగనూరు జాతి ఆవులను మల్నాడు గిడ్డ రకం ఆవులుగా పిలుస్తారు.



రైతుకి ధైర్యం.. ముర్రాజాతి

చిల్లకూరు మండలం చెన్నూరు గ్రామానికి చెందిన వెంకటరెడ్డి గ్రేడెడ్ ముర్రా జాతి గేదెలు పోషిస్తున్నారు. అవి ఒక్కోటి రోజుకు ఉదయం నాలుగు, సాయంత్రం నాలుగు లీటర్ల పాలిస్తున్నాయి. జెర్సీ, హెచ్ఎఫ్ రకాల ఆవులతో పోలిస్తే ఎలాంటి వాతావరణానికైనా ఈ గేదెలు తట్టుకుంటాయని, పెద్దగా వ్యాధులు సోకే పరిస్థితి కూడా వుండదని వెంకటరెడ్డి చెబుతున్నారు.



గ్రేడెడ్ ముర్రా జాతి గేదె


తడ మండలం కొండూరుకు చెందిన రైతు పొదిలి మునిప్రసాద్ పోషిస్తున్న గ్రేడెడ్ ముర్రా జాతి గేదె రోజుకు 12 లీటర్ల పాలిస్తోంది.

ఆవులు-రకాలు	
నాటు ఆవులు:	57,500
ఒంగోలు జాతి:	29,119
జెర్సీ:	98,600
హెచ్ఎఫ్ సంకర జాతి:	43,200

52 కిలోల గంజాయి స్వాధీనం

తిరుపతిలో 30, రేణిగుంటలో 22 కిలోలు ● రెండు ఘటనల్లో 8 మంది అరెస్టు

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): తిరుపతి, రేణిగుంటలో సోమవారం 52 కిలోల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. ఈ రెండు ఘటనల్లో 8 మందిని అరెస్టు చేశారు. తిరుపతిలో గంజాయి రవాణా, విక్రయాలు చేస్తున్న ఐదుగురు అంతర్రాష్ట్ర నిందితులను ఈస్ట్ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. వారి నుంచి 30 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. తిరుపతి నగర డీఎస్పీ వెంకటనారాయణ తెలిపిన ప్రకారం.. అనకాపల్లి జిల్లా గొల్లపేటకు చెందిన గవిరెడ్డి రమణమ్మ, తమిళనాడు రాష్ట్రం కృష్ణగిరి జిల్లా కంపుకాలపట్టికి చెందిన విజయ కన్నుకాన్, పోచంపల్లి తాలూకా బేరుహల్లికి చెందిన మల్లిక కేశవన్, తొట్టాతుకారన్ కొట్టైలో ఉంటున్న రాజామధు, అల్లూరు సీతారామరాజు జిల్లా బొర్తి గ్రామానికి చెందిన సంధ్యారాణి టీమ్‌లుగా ఏర్పడి ఒడిశా, శ్రీకాకుళం ప్రాంతాల నుంచి గంజాయి తెప్పించుకుని తిరుపతి, ఇతర ప్రాంతాల్లోని బ్యాచ్‌లకు సరఫరా చేస్తున్నారు. వీరిలో రమణమ్మ పలుచోట్ల గంజాయి అక్రమ రవాణా కేసుల్లో నిందితురాలు. అరెస్టయి బయటకు రావడం.. మళ్లీ గంజాయి వ్యాపారం చేస్తోంది. ఈ క్రమంలో తమిళనాడుకు చెందిన మంజునాథ, విజయ, మల్లిక ఎక్కువ మొత్తంలో గంజాయి అవసరమని ఈమెను సంప్రదించారు. నర్సీపట్నంకు చెందిన అప్పారావును ఆమె సంప్రదించగా రూ.1.50 లక్షలు విలువ చేసే 30 కిలోల గంజాయిని విక్రయించాడు. ఈ గంజాయిని సంధ్యారాణి సహాయంతో తిరుపతికి తీసుకొచ్చారు. అప్పటికే తిరుపతిలో వేచి ఉన్న విజయ, మల్లిక, మరో సహాయకుడు రాజుకు ఆర్టీసీ బస్టాండు వద్ద అప్పగించి.. అందరూ కలసి బయటకు వెళుతున్నారు. ముందుగా అందిన సమాచారం మేరకు తిరుపతి డీఎస్పీ వెంకటనారాయణ, ఎస్‌ఐ బాలకృష్ణ, మహిళా పోలీసు సిబ్బందితో కలిసి ఐదుగురు నిందితులను అరెస్టు చేశారు. వారి నుంచి 30 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పెద్ద మొత్తంలో గంజాయి సరఫరా చేస్తున్న అప్పారావు, మంజునాథ కోసం పోలీసులు గాలిస్తున్నారు. వీరందరినీ అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ చెప్పారు.



నిందితులను చూపుతున్న ఈస్ట్ పోలీసులు

రేణిగుంటలో ముగ్గురు గంజాయి స్మగ్లర్ల అరెస్టు

రేణిగుంట, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): గంజాయి తరలిస్తున్న ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. రేణిగుంట రూరల్ సీఐ మురళీకృష్ణ సోమవారం వివరాలను వెల్లడించారు. రేణిగుంట సంతగేటు వద్ద సీఐ మురళీకృష్ణ ఆధ్వర్యంలో గాజులమండ్యం ఎస్‌ఐ టి.వి.సుధాకర్‌తో పాటు సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నించిన ముగ్గురుని అదుపులోకి తీసుకున్నారు. వారి బ్యాగులను పరిశీలించగా అందులో గంజాయిని గుర్తించారు. వారిని స్టేషన్‌కు తరలించి విచారించగా నగరికి చెందిన సతీష్, విశాఖకు చెందిన పాత్రో ఉగాది, వడ్డీ కారుణ్యతేజ అని తేలింది. వారు నగరి, తిరుత్తణి పరిసర ప్రాంతాల్లో గంజాయి విక్రయిస్తుంటామని తెలిపారు. నర్సీపట్నానికి చెందిన మహిళ దగ్గర కొనుగోలు చేసినట్లు వివరించారు. దీంతో 22 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని ముగ్గురిని అరెస్టు చేసినట్టు సీఐ తెలిపారు. వీరిని పట్టుకున్న పోలీసు సిబ్బందిని ఎస్పీ సుబ్బరాయుడు అభినందించారు.

న్యాయం చేయాలని కలెక్టరేట్లో వృద్ధురాలి ఫిర్యాదు

- పోలీస్ స్టేషన్‌కు రావాలని ఎస్‌ఐ ఫోన్
- స్టేషన్లోనే బాధితులపై ప్రత్యర్థుల దాడి
- ఘటనపై కలెక్టర్ వెంకటేశ్వర్ సీరియస్

తిరుపతి, కలెక్టరేట్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): తనకు, తన బంధువైన లోకనాథరెడ్డికి చిన్నపాటి భూవివాదం నడుస్తోందని, అతడి మాటలు విని తిరుచానూరు పోలీసులు తనను ఇబ్బంది పెడుతున్నారని కన్నెమ్మ అనే వృద్ధురాలు సోమవారం కలెక్టరేట్లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అధికారులకు ఫిర్యాదు చేశారు. అక్కడే విధుల్లో ఉన్న ఎస్‌ఐ ఈ విషయం తెలుసుకుని ఫిర్యాదుదారును స్టేషన్‌కు రమ్మని చెప్పాడు. అక్కడికి వెళ్లగానే ఎస్‌ఐ ఎదుటే కన్నెమ్మతో పాటు మరో ఇద్దరిపై పోలీసులు సాక్షిగా ప్రత్యర్థి వర్గం దాడి చేసింది.తిరుచానూరు పోలీస్‌స్టేషన్ వేదికగా జరిగిన ఈ ఘటనపై జిల్లా ఉన్నతాధికారులకు కన్నెమ్మ, ఆమె సమీప బంధువు భాస్కర్ ఫిర్యాదు చేశారు. తిరుపతి రూరల్ మండలం బ్రాహ్మణపట్టు పంచాయతీ పాతూరుకు చెందిన కన్నెమ్మకు తన సమీప బంధువు లోకనాథరెడ్డితో భూసమస్య వుంది. అయితే తిరుచానూరు పోలీసుల నుంచీ లోకనాథరెడ్డి పదేపదే తనపై ఒత్తిడి తీసుకువస్తూ బెదిరింపులకు దిగుతున్నాడని ఎస్‌ఐ సాయినాథ చౌదరిపై, లోకనాథరెడ్డిపై కలెక్టరేట్లో సోమవారం కన్నెమ్మ ఫిర్యాదు చేశారు.అక్కడే విధుల్లో ఉన్న ఎస్‌ఐ సాయినాథచౌదరి ఈ విషయం తెలుసుకుని తక్షణమే స్టేషన్‌కు రావాలని కన్నెమ్మకు, అతని మనవడు చెంగారెడ్డికి ఫోన్ చేశారు.దీంతో వారు సోమవారం మధ్యాహ్నం సమీప బంధువు భాస్కర్‌తో కలిసి తిరుచానూరు పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. అప్పటికే అక్కడ లోకనాథరెడ్డి, అతని కుమారుడు, మరదలు అంకమ్మ స్టేషన్లో ఉన్నారు. ఎస్‌ఐ సాయినాథచౌదరి ఎదుటే వారు ఫిర్యాదుదారులు కన్నెమ్మ, చెంగారెడ్డి, భాస్కర్‌లపై దాడి చేశారు. ఇదేమన్యాయం సార్?ఎస్‌ఐగా ఉండి మీరు వారిని ఆపకుండా.. దగ్గరుండి కొట్టిస్తారా అంటూ కన్నెమ్మ సమీప బంధువు భాస్కర్ విలపిస్తూ ఎస్‌ఐ సాయినాథచౌదరిని ప్రశ్నించారు. అయితే బాధితులనే బయటికి వెళ్లాలని పోలీసులు గదమాయించడం కొసమెరుపు.ఈ విషయం తెలిసిన కలెక్టర్ వెంకటేశ్వర్ వెంటనే స్పందించి ఎస్పీ సుబ్బరాయుడితో చర్చించి విచారణ జరిపించమన్నట్లు సమాచారం. అధికార పార్టీలో ఓ కీలకనేత అండ చూసుకుని ఎస్‌ఐ ఇలా వ్యవహరిస్తున్నాడని స్థానికులు విమర్శిస్తున్నారు.



కన్నెమ్మ వర్గీయులతో ప్రత్యర్థివర్గం వాగ్వాదం

నేషనల్ ఛాంపియన్‌షిప్‌కు వెళ్లబోతున్నా

ఇండియన్ షూటర్ ఎలవెనిల్ వలరివన్



తిరుమల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): 2018 జూనియర్ ప్రపంచకప్‌లో భారత్‌కు బంగారు పతకాన్ని సాధించిన ఇండియన్ క్రీడా షూటర్ ఎలవెనిల్ వలరివన్ సోమవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లి శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం ఎలవెనిల్ వలరివన్ ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. చాలా రోజుల తర్వాత స్వామి దర్శనం లభించిందని, మంచి అనుభూతి కలిగిందని సంతోషం వ్యక్తం చేశారు. త్వరలో భోపాల్‌లో జరిగే నేషనల్ ఛాంపియన్‌షిప్ పోటీలకు వెళ్లబోయే ముందు స్వామి ఆశీస్సుల కోసం తిరుమల వచ్చినట్లు తెలిపారు.



నేత్రపర్వం.. కోటి దీపోత్సవం

తిరుపతి ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం రామచంద్ర పుష్కరిణి ప్రాంగణంలో కోటి దీపోత్సవం నిర్వహించారు. కార్తీక మాసంలో 365 వత్తులతో దీపం వెలిగించడం ద్వారా ఏడాది పొడవునా దీపం వెలిగించకపోయినా ఆ అపరాధ భావన పోతుందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ఫిల్మ్ సొసైటీ ఛైర్మన్ వేణుగోపాలరెడ్డి, అధ్యక్షుడు వైఎస్ బాబు, కార్యదర్శి శేషగిరిరావు, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, టీటీడీ సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి, శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహయాదవ్, స్విమ్స్ డైరెక్టర్ రవి కుమార్, పారిశ్రామికవేత్త పీసీ రాయల్, ఫిల్మ్ సొసైటీకి చెందిన ప్రసాదరావు, బుజ్జిబాబునాయుడు, బండి మధుసూదనరెడ్డి, గుల్జార్, అనసూయ, మేరీజాయ్, శాంతావాణి, భాస్కర్, శమంతకమణి, భక్తులు పాల్గొన్నారు.

- తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆంధ్రజ్యోతి

కార్తీక వెలుగుల్లో కపిలతీర్థం

కార్తీక మాసం నాలుగో సోమవారం సందర్భంగా తిరుపతిలోని కపిలతీర్థంలో తెల్లవారుజాము నుంచి రాత్రి వరకూ మహిళలు పిండి తలిగ వేసి నేతి దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. పుష్కరిణికి నాలుగు వైపులా ఉన్న మండపాలలో దీపాలను వెలిగించారు. జలపాతం కింద భక్తులు స్నానాలు ఆచరించారు. అనంతరం కామాక్షి కపిలేశ్వరులను, పరిదేవతలైన వల్లీయమ్మ, సుబ్రమణ్యస్వామి, గురుదక్షిణామూర్తి, నాగలింగ కూటమిని దర్శించుకున్నారు.

శ్రీకాళహస్తిలో

కార్తీకం రద్దీ



నాలుగో కార్తీక సోమవారం సందర్భంగా శ్రీకాళహస్తీశ్వరాలయంలో భక్తుల రద్దీ నెలకొంది. స్వర్ణముఖి నదిలో స్నానాలు ఆచరించి రెండోగేటు సమీపంలో భక్తులు దీపారాధన సమర్పించారు. సుమారు 37వేలమంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రూ.50శీఘ్ర దర్శనం టిక్కెట్లు గరిష్ఠ స్థాయిలో 5,725, రూ.200 ప్రత్యేక ప్రవేశదర్శనం 3,822 కలిపి మొత్తం 9,547 టిక్కెట్లు అమ్ముడైనట్లు అధికారులు పేర్కొన్నారు. ఇక ఐదు రకాల రాహుకేతుపూజలు కలిపి 4,169 జరిగాయి.

- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి



కాలుష్యం కోరల్లో విలవిల



'నిబంధనలు పాటించని పరిశ్రమల నుంచి నిరంతరం వెదజల్లుతున్న రసాయనాల వల్ల ఊపిరి తీసుకోలేకపోతున్నాం. గుండెజబ్బుల బారినపడుతున్నాం.. కళ్లు మంటలతో అల్లాడుతున్నాం. కాపాడండి సారూ' అంటూ రేణిగుంట మండల పరిధిలోని పారిశ్రామికవాడ పల్లెల ప్రజలు వేడుకుంటున్నారు. పీల్చే గాలి, తాగేనీరు కలుషితం కావడంతో ఎప్పుడు ఏ రోగం వస్తుందో తెలియక బతుకు జీవనం సాగిస్తున్నారు.

- పరిశ్రమల నుంచి వెదజల్లుతున్న రసాయనాలు
- రోగాల బారిన పరీవాహక గ్రామాల ప్రజలు
- ఊపిరి తీసుకోలేక పోతున్నాం..కాపాడండి అంటూ వేడుకోలు

కథనం రేణిగుంట,ఆంధ్రజ్యోతి

రేణిగుంట మండలంలోని గాజులమండ్యం, ఎర్రంరెడ్డిపాళెం, రేణిగుంటలో మూడు పారిశ్రామిక వాడలున్నాయి. అప్పటి జనసంఖ్య ఆధారంగా ఈ ప్రాంతాలను పారిశ్రామికవాడలుగా గుర్తించి ప్రభుత్వం కేటాయించింది. నేడు వాటికి చుట్టుపక్కల జనాభా పెరగడంతో ఊర్లు, గ్రామాలు విస్తరించాయి. అదే తరుణంలో పారిశ్రామికవాడల్లో కాలుష్యం పెరిగింది. పరి శ్రమల నుంచి వెలువడే వ్యర్థ రసాయనాలను యథేచ్ఛగా బయటకు వదిలేస్తున్నారు. ఈ విషయమై నల్లపాళెం, నీలసానిపేట, అత్తూరు, దేశమ్మనగర్, గాజులమండ్యం, ఎర్రంరెడ్డిపాళెం, వినాయకపురం గ్రామాల ప్రజలు అనేక పర్యాయాలు ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఫిర్యాదులు చేశారు. చర్యలు తీసుకుంటున్నట్లు ప్రకటించి తర్వాత గాలికొదిలేస్తున్నట్లు స్థానికులు ఆవేదన చెందుతున్నారు. పారిశ్రామికవాడల్లో ప్రమాదాలు నెలకొన్న సమయాల్లో మాత్రం హడావుడి చేసి, నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారే తప్ప



రసాయనాలు వెదజల్లుతున్న మైథిలి కర్మాగారం

శాశ్వత పరిష్కారం చూపేదిశగా చర్యలు తీసుకోవడంలేదన్న విమర్శలు వస్తున్నాయి.

మురుగు కాలువలు లేక..

తిరుపతి-రేణిగుంట మార్గంలోని పారిశ్రామికవాడలో రోడ్లు, మురుగు కాలువలు లేవు. కర్మాగారాల్లో ఉపయోగించే నీటిని బయటకు వదిలేస్తున్నారు. దీంతో కింద ఉన్న ఎర్రంరెడ్డిపాలెం, వినాయకపురం గ్రామాల్లో నీరు కలుషితమై ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. దీనికితోడు రోడ్డుకు ఇరువైపులా ఎక్కడ చూసినా ప్లాస్టిక్, చెత్తా చెదారాలు దర్శనమిస్తున్నాయి. అధికారుల దృష్టికి తీసుకుపోయినా ఇప్పటి వరకు చర్యలు తీసుకోలేదని గ్రామస్తులు వాపోతున్నారు. ఈ విషయమై పర్యావరణ ఇంజనీర్ రాజశేఖర్‌ను వివరణ కోరగా తాను కొత్తగా బాధ్యతలు తీసుకున్నానని, ఈ ప్రాంతాల్లో పర్యటించి నోటీసులు జారీ చేస్తామని అన్నారు. అదేవిధంగా ఇండస్ట్రియల్ కారిడార్ జోనల్ మేనేజరు చంద్రశేఖర్‌ను వివరణ కోరగా రోడ్లు, మురుగు కాలువల నిర్మాణానికి స్థానిక పరిశ్రమల నుంచి సగం వాటా పెట్టుకుంటే పై అధికారుల దృష్టికి తీసుకుపోయి స్థానిక సమస్యలను అధిగమించేందుకు ప్రయత్నం చేస్తామన్నారు. తమకు వచ్చే పన్నులకు కేవలం పారిశ్రామికవాడలో లైట్లు, ఇతర చిన్న సమస్యలను పరిష్కరించగలమని స్పష్టం చేశారు.



రోడ్డు పక్కన పడేసిన ప్లాస్టిక్ వ్యర్థాలు



ఎర్రంరెడ్డిపాళెం పారిశ్రామికవాడలో రోడ్ల దుస్థితి

ఊపిరి తీసుకోలేకపోతున్నాం



మా గ్రామంలో 550 మంది నివసిస్తున్నారు. కర్మాగారాల వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు. అందుకే 2019లో ఎన్నికలను కూడా బహిష్కరించాం. దీంతో అప్పటి ఎన్నికల అధికారి, తహసీల్దారు ప్రాదేయపడి సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. నేటికీ సమస్య అలాగే ఉంది. గ్రామంలో అత్యధికంగా గుండెపోటుకు గురవుతున్నారు. ఆగస్టు, సెప్టెంబరులో ఇద్దరు మృతి చెందారు. గ్రామానికి ఆనుకుని ఉన్న పరిశ్రమ నుంచి వెదజల్లే రసాయన వాయువు వల్ల రాత్రి ఊపిరి పీల్చుకోవడం కష్టంగా ఉంది.

- మోహన్‌రెడ్డి, నల్లపాళెం గ్రామస్తుడు

నోటీసులిచ్చినా పట్టించుకోవడం లేదు



గాజులమండ్యం పారిశ్రామికవాడలోని పలు ఫార్మా కర్మాగారాల నుంచి వచ్చే వాయువుల వల్ల పరిసర గ్రామాల ప్రజలు శ్వాసకోశ వ్యాధులు, కళ్లమంటలకు గురవుతున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి పలుసార్లు నోటీసులు ఇచ్చినా కర్మాగారాల యాజమాన్యాలు పట్టించుకోలేదు. ఇప్పటికైనా ప్రభుత్వ యంత్రాంగం మా గ్రామాల్లో సమస్యలను గుర్తించి, పరిష్కరించాలి.

- కరుణాకరరెడ్డి, అత్తూరు గ్రామస్తుడు

ప్రతి పాఠశాలలో

మెగా పేరెంట్ టీచర్ మీటింగ్

● అధికారులకు కలెక్టర్ ఆదేశం

తిరుపతి, కలెక్టరేట్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): 'బడివైపు ఒక అడుగు- తల్లిదండ్రులతో ముచ్చట్లు' కార్యక్రమంలో భాగంగా ప్రతి పాఠశాలలోనూ మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ నిర్వహించాలని అధికారులను కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం రాత్రి జేసీ శుభం బన్సల్, కార్పొరేషన్ కమిషనరు మౌర్య, డీఈవో కేవీఎన్ కుమార్‌తో కలిసి ఆయన ఈ కార్యక్రమంపై అధికారులతో సమీక్షించారు. విద్యార్థుల తల్లిదండ్రులను పాఠశాలలకు ఆహ్వానించి వారి పిల్లల అసెస్మెంట్ కార్డులను అందించాలన్నారు. పేరెంట్ మీటింగ్ రోజున డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకం ద్వారా అందించే మెనూ ప్రకారం ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులు, విద్యార్థులు అందరూ కలిసి భోజనం చేయాలని సూచించారు. పాఠశాలలో విద్యా విధానం, విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజన పథకం, తాగునీరు, పారిశుధ్యం, పిల్లల రక్తహీనత, వారి ఆరోగ్య సమస్యలు తదితరాలను అడిగి తెలుసుకోవాలన్నారు. పాఠశాలలో మౌలిక సదుపాయాలపై సమీక్షించి పాఠశాల అభివృద్ధికి తల్లిదండ్రులు సహకరించేలా కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో 'గుడ్ టచ్ బ్యాడ్ టచ్' పై బాలికలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రజాప్రతినిధులతో పాటు ఎంఈవో, తహసీల్దార్, ఎంపీడీవోలు కూడా ఈ మీటింగులో పాల్గొనాలని, సచివాలయ సిబ్బందినీ భాగస్వామ్యం చేయాలన్నారు. పూర్వ విద్యార్థులనూ ఆహ్వానించాలన్నారు.

సమీక్షలు .. సమావేశాలు



అధికారులతో సమీక్షిస్తున్న జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్

ఉచిత ఇసుక విధానంలో అక్రమాలకు తావివ్వొద్దు

అక్రమాలకు తావు లేకుండా నూతన ఉచిత ఇసుక పాలసీ అమలు చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. కలెక్టరేట్లో పలు అంశాలపై సోమవారం ఆయన అధికారులతో సమీక్షించారు. హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ జియో ట్యాగింగ్ చేయడంపై సమీక్షిస్తూ ఏర్పేడు, వెంకటగిరి, కేవీబీపురం మండలాల్లో తక్కువ పురోగతి ఉందని, పుత్తూరు మునిసిపాలిటీ పనితీరు బాగుందన్నారు. ఈ నెల 30 నాటికి ఈ కార్యక్రమం పూర్తి చేయాలన్నారు. ఎంఎస్ఎంఈ సర్వేను గడువులోపు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. సీసీ రోడ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. పాట్‌హోల్స్ ఫ్రీ రహదారుల కాన్సెప్ట్ కింద ఆర్అండ్‌బీ కింద 66 పనులు మొదటి విడతగా చేపట్టినవి త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అన్ని ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులను ట్యూషన్ ఫీజు కోసం ఇబ్బంది పెడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. దీనిపై అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు.



వీఏకే రంగారావును సన్మానిస్తున్న పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ తదితరులు

వెండి తెరపై రాముడు, కృష్ణుడు.. ఎన్టీఆరే

సినీ గేయ వజ్రోత్సవ సభలో వీఏకే రంగారావు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): వెండి తెరపై కృష్ణుడు, శివుడు, రాముడిగా ఎన్టీఆర్ తన నటనా ప్రావీణ్యంతో దర్శనమిచ్చారని ప్రముఖ సినీ, సంగీత, నాట్య, కళా విమర్శకుడు వీఏకే రంగారావు పేర్కొన్నారు. అనంతపురానికి చెందిన మహాబోధి సాహిత్య వేదిక ఆధ్వర్యాన ఎస్వీయూనివర్సిటీ సెనేట్ హాలులో సోమవారం జరిగిన ఎన్టీఆర్ వజ్రోత్సవ సినీ గేయ గోష్ఠి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సినిమాల్లో ఎన్టీఆర్ పోషించిన వివిధ పాత్రల గురించి ఆయన ప్రస్తావించారు. సినీ కళారంగం పట్ల అంకిత భావం ఉండటం వల్ల ఒక పాత్రను పరిపూర్ణంగా పోషించగలిగారన్నారు. పౌరాణిక పాత్రల్లో ఆయన ఎంత సజీవంగా నటించారంటే.. వెండి తెరపై సాక్షాత్తు ఆ దేవతామూర్తులను చూసినంత అనుభూతిని ప్రేక్షకులు పొందారని చెప్పారు. తనకు తెలియని విషయాలను తెలుసుకోవడానికి ఎలాంటి సంశయం చూపేవారు కాదన్నారు. సినిమా రంగానికి సంబంధించి తన అభిప్రాయాన్ని ఎన్టీఆర్ ఎదుటే చెప్పినా, సహృదయంతో విమర్శను స్వీకరించారని గుర్తుచేసుకున్నారు. ఎన్టీఆర్ సినిమా పాటలను గుర్తు చేసుకోవడమంటే, తెలుగు జాతి తన సంస్కృతి, సంప్రదాయాలు, చరిత్రనూ జ్ఞాపకం చేసుకున్నట్టు అవుతుందన్నారు. ప్రజలను చైతన్యం చేసే అంశాలు ఎన్టీఆర్ సినిమాల్లో అధికంగా ఉన్నాయని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ అన్నారు. సినీ, రాజకీయ రంగాల్లో ఎన్టీఆర్ ప్రత్యేక ముద్ర వేసుకున్నారని ఎస్వీయూ ఇన్‌చార్జి వీసీ అప్పారావు కొనియాడారు. నేటికీ ఎందరో కళాకారులు, రాజకీయ నాయకులకు ఎన్టీఆర్ స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ భూపతి నాయుడు చెప్పారు. భాష, భావం, అభినయంలో ఎన్టీఆర్‌ను మరో పాత్రతో పోల్చలేమని రిటైర్డు ప్రొఫెసర్ జేవీ సత్యవాణి అభిప్రాయపడ్డారు. ఎన్టీఆర్ సినీ రంగ ఔన్నత్యాన్ని ఈ తరానికి తెలియ చేయడానికే ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని మహాబోధి సాహిత్య వేదిక ప్రతినిధి ఆచార్య జి.బాలసుబ్రమణ్యం తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగు విభాగాధిపతి ఆచార్య రాజేశ్వరమ్మ, రిటైర్డు ప్రొఫెసర్లు కోసూరి దామోదర నాయుడు, కె.మునిరత్నం, ఎన్.మునిరత్నమ్మ, కల్చరల్, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్లు వివేక్, హరికృష్ణ, పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రెండు ఇసుక డంప్‌ల సీజ్



రిలయన్స్ పెట్రోల్‌బంకు వెనుక ఇసుక డంప్

శ్రీకాళహస్తి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): అక్రమంగా నిల్వ చేసిన రెండు ఇసుక డంప్‌లను సీజ్ చేసినట్లు తొట్టంబేడు తహసీల్దారు మధుసూదన్‌రావు తెలిపారు. శ్రీకాళహస్తి శివార్లలోని చెన్నై రోడ్డులో రిలయన్స్ పెట్రోల్ బంకు వెనుక వైపు, తంగేళ్లపాళెం వద్ద మూతపడిన ఓ స్టోన్ క్రషర్ ప్రాంగణంలో ఇసుక డంప్‌లున్నట్లు అధికారులు సమాచారం అందుకున్నారు. ఆదివారం రాత్రి తహసీల్దారు మధుసూదన రావు ఆదేశాలతో సీనియర్ అసిస్టెంట్ నారాయణ, వీఆర్వో దినేష్ రెండు డంప్‌లను సీజ్ చేశారు. అలాగే తొట్టంబేడు మండలం నెల్లిమానుకండ్రిగ వద్ద ఉన్న సమ్మర్ స్టోరేజీ ప్రాంతంలో ఇసుకను నిల్వ చేసి అక్కడి నుంచి తరలించినట్లుగా ఆనవాళ్లను గుర్తించారు. అయితే రెండు ఇసుక డంప్‌లను సీజ్ చేసి దీని వెనుక మూలసూత్రధారులను బహిర్గతం చేయకపోవడంపై రెవెన్యూ అధికారులపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఘాట్‌లో ఎలుగుబంట్ల కలకలం

తిరుమల, నవంబరు25(ఆంధ్రజ్యోతి): తిరుమల ఘాట్‌రోడ్డులో సోమవారం ఎలుగుబంట్ల సంచారం కలకలం రేగింది. తిరుమల నుంచి తిరుపతికి చేరుకునే మొదటిఘాట్‌రోడ్డులో ఏనుగుల ఆర్చ్ దాటాక రెండు ఎలుగుబంట్లు రోడ్డు దాటి కాలినడకమార్గం వైపు వెళ్లడాన్ని కొందరు వాహనదారులు గుర్తించారు. వెంటనే సమాచారాన్ని టీటీడీ, ప్రభుత్వ ఫారెస్ట్, విజిలెన్స్ అధికారులకు అందజేశారు. ఈక్రమంలో అధికారులు ఘటనా ప్రాంతానికి చేరుకుని పరిసర ప్రాంతాలను పరిశీలించారు. అప్పటికే ఎలుగుబంట్లు వెళ్లిపోయినట్టు నిర్ధారించుకున్నారు. అయినప్పటికీ వాహనదారులను, నడకమార్గంలో వచ్చే భక్తులను అప్రమత్తం చేసి పంపుతున్నారు.

మున్సిపాలిటీపై ప్రత్యేక దృష్టి: కురుగొండ్ల



మున్సిపల్ సిబ్బందితో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల

వెంకటగిరి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): వెంకటగిరి మున్సిపాలిటీపై ప్రత్యేక దృష్టి సారించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. సోమవారం మున్సిపల్, తహసీల్దారు కార్యాలయాల్లో ప్రజా విజ్ఞప్తుల కార్యక్రమ నిర్వహణ తీరును ఆయన పరిశీలించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో పరిస్థితులపై సిబ్బందితో సమీక్షించారు. సిబ్బంది కొరత వల్ల విధుల నిర్వహణ ఇబ్బందిగా మారిందని చెప్పడంతో ఎమ్మెల్యే వెంటనే ఫోన్‌లో జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్‌తో మాట్లాడారు. 76 మంది సిబ్బంది పనిచేయాల్సిన మున్సిపల్ కార్యాలయంలో కేవలం 26 మంది ఉండటం, కమిషనర్ కూడా అనారోగ్యంతో సెలవుపై వెళ్లడంతో పాలన అస్తవ్యస్తంగా తయారైందన్నారు. త్వరలో సిబ్బందిని నియమించేలా చర్యలు తీసుకొంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు. మున్సిపాలిటీలో కొత్త ఛైర్మన్‌ను త్వరలో ఎన్నుకోవడం జరుగుతుందని ఎమ్మెల్యే చెప్పడంతో ఉన్న ఛైర్మన్ పరిస్థితి ఏమిటని విలేకర్లు ప్రశ్నించగా ఆమె కూడా తమ పార్టీయేనంటూ చిరునవ్వుతో బదులిచ్చారు. కార్యక్రమంలో నాయకులు టీడీపీ గంగోటి నాగేశ్వరరావు, చెలికం మధుసూదనరెడ్డి, కేవీకే ప్రసాద్ నాయుడు, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి సమస్యనూ పరిష్కరిస్తాం: విజయశ్రీ



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ, పక్కన మున్సిపల్ కమిషనర్ చిన్నయ్య, టీడీపీ నాయకులు రమేష్, ఏజీ కిషోర్

సూళ్లూరుపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అందిన ప్రతి అర్జీనీ పరిశీలించి పరిష్కరిస్తామని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. సోమవారం మున్సిపాలిటీలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. తాగునీటి సమస్య, డ్రైనేజీ, విద్యుత్ సమస్యలపై పలువురు వినతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన ప్రతి సమస్యను పరిష్కరిస్తామన్నారు. ప్రజలు ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, టీడీపీ నాయకులు వాకచర్ల రమేష్, మాధవనాయుడు, బండారు ఆంజనేయులు, మున్సిపల్ కమిషనర్ చిన్నయ్య, మేనేజర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.


చెంచుకుమార్‌కు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు



అవార్డు అందుకుంటున్న చెంచుకుమార్

ఓజిలి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ఓజిలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోషల్ టీచర్ కె.చెంచుకుమార్ రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నారు. ఆంధ్రప్రదేశ్ సోషల్ స్టడీస్ టీచర్స్ ఫోరమ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కృష్ణారెడ్డి, సురేష్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం విజయనగరంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్సీలు రఘువర్మ, చిరంజీవి చేతుల మీదుగా చెంచుకుమార్ అవార్డు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు, విజయ నగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాల విద్యాశాఖ అధికారులు మాణిక్య నాయుడు, తిరుపతి నాయుడు, బ్రహ్మాజీరావు, విశాఖ ఆర్జేడీ విజయభాస్కర్, ఫోరమ్ గౌరవాధ్యక్షుడు ఎల్లం రాంబాబు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధికి రూ.2.50 లక్షల విరాళం



సీఎం చంద్రబాబుకు చెక్కును అందజేస్తున్న ది మద్రాసు చిల్లీస్ మర్చంట్స్ అసోసియేషన్ ప్రతినిధులు, వేనాటి సతీష్ రెడ్డి

సూళ్లూరుపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): విజయవాడ తుఫాన్ బాధితుల సహాయార్థం సీఎం సహాయ నిధికి ది మద్రాసు చిల్లీస్ మర్చంట్స్ అసోసియేషన్ రూ.2.50 విరాళం అందజేసింది. టీడీపీ జిల్లా కార్యదర్శి వేనాటి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని కలిసిన అసోసియేషన్ ప్రతినిధులు చెక్కు అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.శివకుమార్, ఉపాధ్యక్షులు ఎస్.బాలకోటయ్య, ఎస్‌కే.హిమామ్, కార్యదర్శి చెన్నకేశవులు, సహాయ కార్యదర్శిలు సెంథిల్ కుమార్, వి.ధనుంజయ నాయుడు, ట్రెజరర్ ఎస్.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

జంతు సంరక్షణ అందరి బాధ్యత

సూళ్లూరుపేట, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): జంతు సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని స్థానిక వీఎస్ఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల జంతుశాస్త్ర విభాగాధిపతి శ్రీనివాస్ అన్నారు. సోమవారం కళాశాలలో జాతీయ జంతు సంక్షేమ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జంతువుల సంరక్షణను విస్మరిస్తే పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుందన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ విక్టోరియా రాణి, అధ్యాపకులు రాజా, సుబ్రహ్మణ్యం, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న వైస్ ప్రిన్సిపాల్ విక్టోరియా రాణి

భవనం నుంచి పడి కూలీ మృతి

సూళ్లూరుపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణంలోని చెంగాళమ్మ ఆలయ సమీపంలో నిర్మాణంలో ఉన్న భవనంపై నుంచి పడి సెంట్రింగ్ కూలీ పోలు దయాల్(47) మృతి చెందిన సంఘటన సోమవారం చోటుచేసుకొంది. బంధువుల కథనం మేరకు... మండల పరిధిలోని తేవలతేరికట్టుకు చెందిన దయాల్ సెంట్రింగ్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం సూళ్లూరుపేట పట్టణంలోని చెంగాళమ్మ లే అవుట్‌లో జరుగుతున్న భవన నిర్మాణ పనికి వెళ్లాడు. సెంట్రింగ్ రేకులు తీస్తూ కిందకు వేసే సమయంలో అదుపు తప్పి మూడంతస్తుల భవనంపై నుంచి పడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడు కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు.

పిల్లర్లకే పరిమితమైన పంచాయతీ భవనం

తడ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ భవనం పిల్లర్లస్థాయిలోనే నిలిచిపోయింది. మండల పరిధిలోని వాటంబేడు పంచాయతీకి పరిపాలన భవనంలేదు. 2017లో అప్పటి ప్రభుత్వం పంచాయతీ నూతన భవన నిర్మాణానికి నిధులు కేటాయించారు. సుమారు 5లక్షల రూపాయల వ్యయం ఖర్చుచేసి పిల్లర్లస్థాయి వరకు ఆ భవన నిర్మాణం చేశారు. ఆ తరువాత 2019 ఎన్నికల హడావుడి మొదలుకావడంతో నిధుల విడుదల ఆలస్యమైంది. ఆ తరువాత ప్రభుత్వం మారిపోవడంతో నిర్మాణంలో ఉన్న ఆ పంచాయతీ భవనం అలాగే దిష్టిబొమ్మలా నిలబడిపోయింది. గత ప్రభుత్వంలో సచివాలయాలను ఏర్పాటు చేశారు. సుమారు 45 లక్షల రూపాయలను ఒక్కోక్క సచివాలయ భవన నిర్మాణానికి నిధులు విడుదల చేశారు. వాటంబేడు సచివాలయ భవన నిర్మాణానికి వచ్చేసరికి అప్పటికే పిల్లర్లస్థాయి నిర్మాణం పూర్తిచేసుకున్న ఈ పంచాయతీ భవనాన్ని వదిలేసి మరో ప్రదేశంలో సచివాలయ నిర్మాణం చేపట్టారు. దీంతో పిల్లర్లస్థాయిలో ఈ భవనం దిష్టిబొమ్మలా మారిపోయింది. ఇలా ప్రజాధనం వృథా అయ్యింది.



పిల్లర్లతో ఆగిపోయిన పంచాయతీ భవన నిర్మాణం





నాయుడుపేట వద్ద స్వర్ణముఖినది, గూడూరులోని శివాలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

కార్తీక పూజలు

నాయుడుపేట టౌన్, వెంకటగిరి టౌన్, డక్కిలి, గూడూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట పట్టణంలోని స్వర్ణముఖినది తీరాన వెలసిన ప్రసూనాంబ సమేత నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో కార్తీక సోమవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజాము నుంచే మహిళలు ఆలయంలో, స్వర్ణముఖినదిలో కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే పట్టణంలోని జంబుకేశ్వర స్వామి ఆలయాలలో కార్తీక పూజలు నిర్వహించారు. ● వెంకటగిరి పట్టణంలోని కాశీ విశ్వనాథ స్వామి, రామలింగేశ్వర స్వామి, కర్ణకమ్మ వీధిలోని హర హరక్షేత్రం, వల్లివేడు క్రాస్ వద్ద మల్లిఖార్జున భ్రమరాంబిక ఆలయాల్లో కార్తీక మాసం నాల్గవ సోమవారాన్ని పురష్కరించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉదయం నుంచే మహిళలు ఆలయాలకు చేరుకుని కార్తీక దీపాలు వెలిగించారు. ● డక్కిలి మండలంలోని స్తంభాలగిరి ఈశ్వరయ్య స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. సోమవారం వేకువజాము నుంచే మహిళలు ఆలయానికి చేరుకొని దీపాలు వెలిగించి స్వామివారిని దర్శించుకొన్నారు. ఆలయ ఈవో శ్రీనివాసులు రెడ్డి భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు. ఆలయంలో భక్తులకు అన్నదానం, తీర్థప్రసాలు అందజేశారు. ● కార్తీక మాసం నాలుగోవ సోమవారం సందర్భంగా గూడూరు పట్టణంలోని శివాలయాలు భక్తులతో రద్దీగా మారాయి. స్థానిక శివాలయం, వీరభద్రస్వామి ఆలయం, సోమేశ్వరస్వామి ఆలయాలలో భక్తులు కార్తీక దీపాలను వెలిగించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

వైభవంగా అయ్యప్ప పడిపూజ



పడిపూజోత్సవంలో అయ్యప్ప భక్తులు

నాయుడుపేట టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని లోతువానిగుంట గిరిజనకాలనీలో సోమవారం రాత్రి అయ్యప్ప పడిపూజోత్సవం నిర్వహించారు. శబరిమలై తరహాలో అరటి బొద్దులతో అయ్యప్పస్వామి గుడిని రూపొందించి పూజలు చేశారు. అయ్యప్ప భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకోండి

సూళ్లూరుపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకోవాలని సోమవారం సీపీఐ పట్టణ కార్యదర్శి ఆనంద్ సీఐ మురళీకృష్ణ, ఎస్ఐ బ్రహ్మానాయుడుకు వినతిపత్రం అందజేశారు. సూళ్లూరుపేట నుంచి శ్రీసిటీ, మాంబట్టు పారిశ్రామికవాడకు వెళ్లే ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు ఎక్కడ పడితే అక్కడ నిలిపివేస్తున్నారని, ఈ వాహనాల వల్ల ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతోందన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



మద్యం దుకాణాలను తనిఖీ చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

నాయుడుపేట టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మద్యం దుకాణదారులు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని అసిస్టెంట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఉషసిరి అన్నారు. పట్టణంలోని మద్యం దుకాణాలను సోమవారం ఆమె తనిఖీ చేశారు. దుకాణ యజమానులకు సూచనలు చేశారు. అలాగే పెళ్లకూరు మండలం చావాలి గ్రామంలో బెల్టుషాపు నిర్వహిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకొని 12మద్యం బాటిళ్లను సీజ్ చేశారు. కార్యక్రమంలో టాస్క్‌ఫోర్స్ సీఐ బాలకృష్ణ, నాయుడుపేట ఎక్సైజ్ సీఐ అరుణకుమారి, ఎస్ఐలు గంగాధర్, రఫీ అహ్మద్, సిబ్బంది పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి



రోగులతో మాట్లాడుతున్న టాస్క్‌ఫోర్స్ అధికారి డాక్టర్ హర్షవర్ధన్

తడ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారి డాక్టర్ హర్షవర్ధన్ అన్నారు. తడ మండలంలోని రామాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని భీములవారిపాలెంలో ఆరోగ్య ఉప కేంద్రాన్ని ఆయన సోమవారం పరిశీలించారు. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ఆరోగ్య పథకాల గురించి వివరించారు. అనంతరం వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో జయశ్రీదేవి, నాగేంద్రకుమార్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడికి పితృవియోగం

పెళ్లకూరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వేలూరు మురళీకృష్ణారెడ్డి తండ్రి జనార్దనరెడ్డి(78) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. వివిధ పార్టీల నాయకులు శిరసనంబేడులోని మురళీకృష్ణారెడ్డి స్వగృహానికి చేరుకుని జనార్దనరెడ్డి భౌతికకాయానికి నివాళులర్పించారు. నాయుడుపేట ఏఎంసీ మాజీ ఛైర్మన్ శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, పేరం రమేష్‌నాయుడు, సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు, జీలపాటూరు సర్పంచు కందమూడి శివకుమార్, శిరసనంబేడు సర్పంచు గుంటపూడి పెంచలయ్య, పాపాడి రాజగోపాల్‌రెడ్డి, కాటూరు గోపాల్‌రెడ్డి, కందమూడి పళనీ, జీవీఆర్ నాయుడు, మస్తాన్ రెడ్డి, పాలచ్చూరు నరేంద్ర యాదవ్, వేణురెడ్డి, పరుశురాం, వైసీపీ నాయకులు కలికి మాధవరెడ్డి, చిందేపల్లి మధుసూదన్‌రెడ్డి, చెంబేడు ఎంపీటీసీ సభ్యుడు రవిరెడ్డి తదితరులు జనార్దనరెడ్డి భౌతికకాయానికి నివాళులర్పించారు.

ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం

వాకాడు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిరుమూరు గ్రామంలోని కండ్రిగ ఆక్వా గుంటల వద్ద ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. అందులో ఉన్న రాగి వైరు, ఆయిల్, కాయల్స్‌ను ఎత్తుకెళ్లారు.

హెచ్ఐవీ, క్షయ నిర్మూలనపై అవగాహన

నాయుడుపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రాణాంతకమైన హెచ్‌ఐవీ, క్షయ పట్ల విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని నవజీవన్ ఆర్గనైజింగ్ సంస్థ మేనేజింగ్ బాలాజీరాజు అన్నారు. నాయుడుపేట నారాయణ స్కూల్‌లో సోమవారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక బేరిపేటలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నారాయణ స్కూల్ ప్రిన్సిపాల్ మల్లికార్జున, ఏవో గౌస్, డీన్ బాలగురవయ్య, తదితరులు పాల్గొన్నారు.

'ఆడపిల్లలను కాపాడుకుందాం'

కోట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మహిళా చట్టాలపై అవగాహన కల్పించి ఆడపిల్లలను కాపాడుకుందామని తహసీల్దారు జయజయరావు, ఎంపీడీవో వేణు, ఏపీఎం అనీలా అన్నారు. కోటలో సోమవారం మహిళా హింస నిర్మూలన దినం నిర్వహించారు. స్థానిక వెలుగు కార్యాలయం నుంచి ఆర్‌అండ్‌బీ రోడ్డు వరకు పొదుపు మహిళలు, వీవోఏలు ర్యాలీ నిర్వహించారు. అక్కడ మానవహారం నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ చట్టాలపై అవగాహన లేని కారణంగా ఎంతో మంది మహిళలు బలైపోతున్నారన్నారు. గృహహింస, మహిళల వేధింపులు, అత్యాచారాలు, అత్యాచార యత్నాలు, తదితర వాటికి సంబంధించిన చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీసీలు శ్రీకాంత్, భాస్కర్, శంకరయ్య ప్రసాద్, అలివేలమ్మ, బిందు, తదితరులు పాల్గొన్నారు.

రామ్మూర్తి నాయుడికి నివాళి



రామ్మూర్తినాయుడి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టీడీపీ నేతలు

కోట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు తమ్ముడు, చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తినాయుడికి కోటకు చెందిన పలువురు టీడీపీ నాయకులు నివాళులర్పించారు. సోమవారం చంద్రగిరి మండలం నారావారిపల్లిలో నారా రామ్మూర్తి నాయుడు చిత్రపటానికి టీడీపీ జిల్లా కార్యదర్శి తూపిలి రాధాకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నాయకులు నివాళులర్పించారు.

కోటలో శాశ్వత ఆధార్ కేంద్రం ఏర్పాటు

కోట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గిరిజనాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శాశ్వత ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీవో వేణు తెలిపారు.

భూ ఆక్రమణదారులపై చర్యలు తీసుకోండి

గూడూరు అర్బన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): తమకు ప్రభుత్వం మంజూరు చేసిన భూములను ఆక్రమిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామ సేవకులు డిమాండ్ చేశారు. సోమవారం వారు మండలంలోని పోటు పాళెం గ్రామంలో గ్రామసేవకులకు కేటాయించిన భూముల వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గ్రామసేవకుల సంఘం జిల్లా కార్యదర్శి సుబ్బయ్య మాట్లాడుతూ గతంలో పోటుపాళెం గ్రామంలో ప్రభుత్వం 20మంది గ్రామ సేవకులకు 13 ఎకరాల భూమి కేటాయించిందన్నారు. గ్రామానికి చెందిన కొందరు తమ భూములను ఆక్రమించుకున్నారని, ప్రశ్నిస్తే దౌర్జన్యానికి దిగుతున్నారన్నారు. అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంజీవయ్య, బాబు, రాజయ్య, సుబ్రహ్మణ్యం, రఘు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



నెల్లూరుకు చెందిన నూర్షహాన్ దివ్యాంగుడు. రెండుకాళ్లు పూర్తిగా చచ్చుపడిపోయినా ఆత్మవిశ్వాసంతో మిమిక్రీలో ప్రావీణ్యం సాధించాడు. సోమవారం రాత్రి నాయుడుపేట గాంధీ మందిరం సెంటర్‌లో తన అద్భుతమైన ప్రదర్శనతో అందరి మన్ననలు పొందాడు. - నాయుడుపేట

రౌడీయిజాన్ని ఉపేక్షించవద్దు: పాశిం

గూడూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ పరిధిలో ఎవరైనా రౌడీయిజానికి పాల్పడితే ఎంతటివారైనా ఉపేక్షించవద్దని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. సోమవారం ఆయన తన నివాసంలో నియోజకవర్గ పరిధిలోని పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిని ఉపేక్షించవద్దని, వారిపై కఠిన చేపట్టి శాంతిభద్రతలు నెలకొల్పేలా చూడాలన్నారు. కార్యక్రమంలో సీఐలు శేఖర్‌బాబు, కిషోర్‌బాబు, శ్రీనివాస్, హుస్సేన్‌బాషా, ఎస్ఐలు మనోజ్‌కుమార్, సురేష్‌బాబు, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పట్టణాధ్యక్షుడు శేఖర్‌రెడ్డిపై సస్పెన్షన్ వేటు

తడ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట వైసీపీ పట్టణాధ్యక్షుడు కళత్తూరు శేఖర్‌రెడ్డిపై ఆ పార్టీ అధిష్ఠానం సస్పెన్షన్ వేటు వేసింది. శేఖర్‌రెడ్డి వైసీపీలో ఉంటూ పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని, అంతేకాకుండా టీడీపీ నేతలతో సఖ్యతగా ఉంటున్నారని మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పార్టీ అధినేత జగన్మోహన్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. దీంతో రెండు వారాల క్రితం శేఖర్‌రెడ్డికి వైసీపీ అధిష్ఠానం షోకాజ్ నోటీసు ఇచ్చింది. ఆయన ఇచ్చిన సంజాయిషీ సంతృప్తికరంగా లేని కారణంగా శేఖర్‌రెడ్డిని పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు ఉమ్మడి నెల్లూరు జిల్లా వైసీపీ అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

పేదలకు వరం సీఎం సహాయనిధి



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

గూడూరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో చికిత్స పొందుతున్న పేదలకు సీఎం సహాయనిధి వరంలాంటిదని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. నియోజకవర్గ పరిధిలోని 15మందికి వైద్యఖర్చుల నిమిత్తం సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.17.11 లక్షల చెక్కులను ఎమ్మెల్యే తన క్యాంపు కార్యాలయంలో సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో పేదలు వైద్య ఖర్చులకు ఇబ్బంది పడకుండా సీఎం రిలీఫ్ ఫండ్‌ను ఆర్థికంగా చేయూతనిస్తున్నామన్నారు. తాను పేద, మధ్యతరగతి ప్రజల అండదండలతోనే ఎమ్మెల్యే అయ్యానని, వారికి ఏ కష్టం వచ్చినా తనవంతు సహకారం అందిస్తామన్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో నియోజకవర్గంలోని పలు సమస్యలను ప్రస్తావించగా సీఎం స్పందించి నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. ప్రధానంగా రహదారుల అభివృద్ధికి నిధులు కేటాయించారని, త్వరలోనే పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. కాగా, అంచనాల కమిటీ సభ్యుడిగా ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ నియమితులవడంతో ఆయనకు స్థానిక టీడీపీ నాయకులు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో శీలం కిరణ్‌కుమార్, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, పులిమి శ్రీనివాసులు, వెంకటేశ్వర్లురాజు, అబ్దుల్‌రహీం, బిల్లు చెంచురామయ్య, తక్కెళ్లపాటి చంద్రమౌళి, నాగరాజు, వాటంబేడు శివకుమార్, జలీల్‌అహ్మద్, జహంగీర్, నంబూరు వెంకటేశ్వర్లు నాయుడు, జలీల్‌అహ్మద్, దుద్దా రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం పట్టణానికి చెందిన విద్యార్థి తరుణీష్ జత్యా ఇటీవల గుజరాత్‌లో జరిగిన అండర్-17 ఆర్చరీ పోటీల్లో ప్రతిభచాటడంతో ఆ విద్యార్థినిని ఎమ్మెల్యే అభినందించారు. అలాగే చెన్నూరు గ్రామానికి చెందిన దివ్యాంగుడు వీరయ్యకు ట్రైసైకిల్ అందజేశారు.

జాతీయ యోగా పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులకు ప్రసంశాపత్రాలు అందజేస్తున్న హెచ్ఎం అన్నామణి

నాయుడుపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): జాతీయ యోగా పోటీల్లో ఎల్‌ఏ సాగరం విద్యార్థులు ప్రతిభ కనపరచినట్లు ప్రధానోపాధ్యాయురాలు అన్నామణి తెలిపారు. తమిళనాడు ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్శిటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన జాతీయ యోగా పోటీల్లో ఎల్‌ఏ సాగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థిని పవిత్ర విద్యార్థులు ప్రతిభ కనపరిచారు. టీఎస్ఎస్‌వైసీ వారిచే షీల్డ్, ప్రసంశాపత్రాలను పొందారన్నారు. అలాగే 9వ తరగతి విద్యార్థులు షరీఫ్, ఖలీల్ కామన్ లీగల్ విభాగంలో ప్రతిభచూపి షీల్డ్‌ను సాధించినట్లు తెలిపారు. సోమవారం ప్రధానోపాధ్యాయురాలు విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ పద్మజ, ఉపాధ్యాయులు జి.వెంకటేశ్వర్లు, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై పోలీసులకు అవగాహన



అవగాహన కార్యక్రమంలో ఏపీపీ ప్రకృతికుమార్, డీఎస్పీ చెంచుబాబు

సూళ్లూరుపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): అరెస్టు, రిమాండ్, సోషల్ మీడియాకి సంబంధించిన నేరాలు, కొత్త చట్టాలపై సూళ్లూరుపేట సర్కిల్ అధికారులకు నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కేజే ప్రకృతికుమార్ ఆధ్వర్యంలో ఆదివారం సూళ్లూరుపేట సర్కిల్ కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి పోలీస్ స్టేషన్‌లో కొత్త చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నామని డీఎస్పీ తెలిపారు. పోలీసు అధికారులు ముఖ్యంగా సోషల్ మీడియాకు సంబంధించిన నేరాలపై పూర్తిస్థాయిలో చట్టపరమైన అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ మురళీకృష్ణ, తడ, సూళ్లూరుపేట, దొరవారిసత్రం ఎస్ఐలు కొండప నాయుడు, బ్రహ్మనాయుడు, అజేయ్‌కుమార్ పాల్గొన్నారు.